మంగళవారం
YUESDAY
3-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 125

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక



బిడ్డ కోసం తల్లిదండ్రుల ఆవేదన



ఐదు రోజుల వయసులో దత్తత తీసుకుని మూడేళ్లుగా అల్లారుముద్దుగా పెంచుకుంటున్న బాలుడిని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించడంతో తల్లిదండ్రులు న్యాయం కోసం పోరాడుతున్నారు. బాలుడిని తీసుకెళ్లే సమయంలో 'అమ్మా.. నన్ను తీసుకెళ్లమ్మా.. నన్ను విడిచిపెట్టి వెళ్లకమ్మా..' అంటూ చిన్నారి వేడుకుంటున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు అక్టోబరు 16న బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. అక్టోబరు 28న ఉత్తర్వుల ప్రతిని బాలల సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారులకు అందజేసినా బాలుడిని అప్పగించలేదని పేర్కొన్నారు. దీంతో అక్టోబరు 29న హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు తరువాయి 2 వ పేజీలో...

ఆస్తి కోసం కన్న తండ్రి హత్య



కుటుంబ ఆస్తుల పంపకాలు, వ్యవసాయ భూములు, పెట్రోల్ బంక్ వ్యవహారాల్లో తలెత్తిన వివాదాలతో కన్నతండ్రినే కుమారుడు హతమార్చిన ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడిపల్లి వెంకటేశం (58), ఆయన కుమారుడు లక్ష్మణ్ (36) మధ్య కొంతకాలంగా ఆస్తి విషయాల్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అక్టోబరు 31న సాయంత్రం పెట్రోల్ బంక్ నిర్మాణ పనుల వద్ద ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన లక్ష్మణ్ బండరాళ్లు, కర్రతో తండ్రిపై దాడి చేయడంతో వెంకటేశం అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన తల్లి మల్లీశ్వరిపైనా తరువాయి 2 వ పేజీలో...



లక్షమందికి ఫ్రీగా ఏఐ ట్రైనింగ్

అమెజాన్‌తో తెలంగాణ సర్కార్ ఒప్పందం

హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) సహకారంతో లక్ష మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉచిత శిక్షణ అందించనుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), ఏడబ్ల్యూఎస్ మధ్య సోమవారం కీలక ఒప్పందం కుదిరింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా టెక్నికల్స్ స్కిల్స్ నేర్పించనున్నారు. ప్రభుత్వానికి, కళాశాలలకు, విద్యార్థులకు తరువాయి 2 వ పేజీలో...

రాహుల్‌కు కప్పం

జోరుగా రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు



తెలంగాణ రాజకీయాల్లో అధికారమే లక్ష్యంగా బీజేపీ తన దూకుడు పెంచుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించి, బీజేపీ పాలన తీసుకురావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ మహాపాదయాత్ర ముగింపు సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సందర్భాన్ని గుర్తుచేస్తూ సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రస్తావించారు. నాడు పటేల్ నిజాం మెడలు వంచడం వల్లే హైదరాబాద్ భారతదేశంలో అంతర్భాగమైందని వ్యాఖ్యానించారు.

రాష్ట్రం కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారింది

అవినీతిమయంగా కాంగ్రెస్ ప్రభుత్వం

కేంద్ర మంత్రి అమిత్ షా తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, ఓటర్ల జాబితా సవరణ, చొరబాటుదారులు, ఈవీఎంలు, అవినీతి అంశాలను ప్రస్తావించారు. బీజేపీ నిర్వహించిన 'లోకతంత్ర బచావో.. అరాచకత హటావో' మహాపాదయాత్రలో అమిత్ షా పాల్గొన్నారు. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర.. అబిడ్స్ మీదుగా మొజంజాహి మార్కెట్ వరకు సాగింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా రేవంత్‌రెడ్డి మార్చారని అమిత్ షా ఆరోపించారు. తెలంగాణలో రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, ఈ ఆర్ఆర్ ట్యాక్స్ ఎక్కడికి వెళ్తోందన్నారు. రాహుల్‌గాంధీ కోసమే ఇక్కడ ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అవినీతిని ఒవైసీ ఆపుతారా.. బీఆర్ఎస్ ఆపుతుందా అని ప్రశ్నించారు. కాం గ్రెస్ అవినీతిని కేవలం బీజేపీ మాత్రమే ఆపగలుగుతుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ తరువాయి 2 వ పేజీలో...



ఫైనల్ కాపీ ఉంటేనే సెన్సార్ సర్టిఫికెట్: సీబీఎఫ్‌సీ

న్యూఢిల్లీ: సినిమా సెన్సార్ విషయంలో సీబీఎఫ్‌సీ నిబంధనలు మరింత కఠినతరం చేసింది. ఇకపై పూర్తిగా రిలీజుకు రెడీ అయిన ఫైనల్ కాపీనే సెన్సార్ సర్టిఫికేషన్ కోసం సమర్పించాలని సూచించింది. సెన్సార్ ఆలస్యం అవడం లేదా రిజెక్ట్ అవడం జరుగుతుందని, రిలీజ్ డేట్ ఇచ్చేశాం కదా అని వెంటనే సెన్సార్ సర్టిఫికెట్ కావాలంటే కుదరదని స్పష్టం చేసింది. సినిమా టైటిల్‌లో తరువాయి 2 వ పేజీలో...



మెట్రో-2కు కేంద్రం 275 కోట్లు

హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత విస్తరించే దిశగా మెట్రో రైలు రెండో దశ పనులకు సంబంధించి కీలక ఆర్థిక కేటాయింపు వెలుగులోకి వచ్చింది. మెట్రో అభివృద్ధి, ప్రాజెక్టు రుణాల చెల్లింపుల కోసం మొత్తం రూ.275 కోట్లను మంజూరు చేస్తూ పరిపాలనాపరమైన తరువాయి 2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

గ్రాము-24 క్యారెట్స్):	రూ.13,888
వెండి (కిలో):	రూ.2,00,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,361

విశ్వవాణి



కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత స్వయంప్రేరిత వ్యవస్థల పనితీరుపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సైబర్ భద్రతా పరీక్షల సందర్భంగా కొన్ని ఏఐ వ్యవస్థలు అంతర్గత పరీక్షా వాతావరణం నుంచి బయటకు వెళ్లి, భద్రతా లోపాలను ఉపయోగించుకున్నట్లు ఓపెన్‌ఏఐ వెల్లడించింది. అనుమతి లేని సమాచార మార్పాల ద్వారా ఇతర వ్యవస్థలతో సంబంధాలు ఏర్పరచుకోవడంతో పాటు, హార్డింగ్ ఫేస్ మౌలిక సదుపాయాల్లోని కొన్ని విభాగాలను కూడా ప్రాప్యత చేసినట్లు తెలిపింది. అయితే ఈ కార్యకలాపాలు భద్రతా పరిమితులు తగ్గించిన పరీక్షా వాతావరణంలోనే చోటుచేసుకున్నాయని సంస్థ స్పష్టం చేసింది.



హెచ్ఐవీ జెనెరిక్‌కు అమెరికా ఆమోదం

డాక్టర్ రెడ్డీస్‌కు మరో విజయం

వాషింగ్టన్: హెచ్ఐవీ నివారణలో అత్యంత ప్రభావవంతంగా పనిచేసే లేనాకాపవిర్ ఇంజెక్షన్ జెనెరిక్ వర్షన్‌ను తక్కువ ఆదాయం ఉన్న దేశాల్లో విక్రయించడానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఆమోదం తెలిపింది. ఏడాదికి రెండు సార్లు మాత్రమే తీసుకునే ఈ లాంగ్-యాక్టింగ్ ఇంజెక్షన్ జెనెరిక్ ఉత్పత్తికి అనుమతి లభించడం వల్ల పేద దేశాల్లో ప్రాణరక్షణ ఔషధాల లభ్యత మరింత సులభతరం కానుంది. గిలియాడ్ సంస్థ అభివృద్ధి చేసిన ఒరిజినల్ ఔషధానికి ప్రతిరూపంగా భారతదేశానికి చెందిన -2 వ పేజీలో...

తాగి తన్నుకున్నారు!

ఢిల్లీ హోటల్లో మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కొట్లాట

రూంలో వేసి.. కొడతానంటూ మంత్రి బూతులు!

డీసీసీ నియామకంలో తలెత్తిన వివాదం మంత్రి, ఎమ్మెల్యే మధ్య చిచ్చును రాజేసింది. ఢిల్లీ హోటల్లో మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు తాగి కొట్టుకోవడం ఆ పార్టీలో కలకలం రేపింది. శాంగ్రిలా హోటల్ లాబీలో '..పగలగొడ్తా, నీ గురించి ఏం అనుకుంటున్నావు" అంటూ లక్ష్మీకాంతరావుపై దామోదర రాజనర్సింహ దాడికి పాల్పడినట్లు సమాచారం.



న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): ఇద్దరి మధ్య మాటలు ముదరడంతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఘటన సమయంలో మల్‌రెడ్డి రంగారెడ్డి, ఓ పత్రిక సీనియర్ జర్నలిస్ట్ ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నట్లు తెలిసింది. మిగతా ఎమ్మెల్యేల ముందే మంత్రి తనను దూషించి, అవమానపరిచాడని లక్ష్మీకాంతరావు త్వరలో అధిష్ఠానానికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే పట్ల మంత్రి వ్యవహరించిన తీరుపై పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఢిల్లీలో నిర్వహించిన తరువాయి 2 వ పేజీలో...

చైనాలో ఏఐ రూల్ బుక్

ఉద్యోగాల కోతకు చెక్



కార్మికుల రక్షణకు 18 సూత్రాల ప్రణాళిక

ఉద్యోగ కోతలకు ముందే అంచనా

బాధితులకు ముందస్తు సమాచారం

ఏఐ ప్రయోజనాల్లో కార్మికులకూ వాటా

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విస్తరణతో ఉద్యోగ భద్రతపై ఆందోళనలు పెరుగుతున్న వేళ చైనా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతికత అభివృద్ధికి అడ్డుకట్ట వేయకుండా, దాని వల్ల కార్మికులు నష్టపోకుండా రక్షణ కల్పించడంపై దృష్టి సారించింది. ఆటోమేషన్ కారణంగా ఉద్యోగాలపై పడే ప్రతికూల ప్రభావాన్ని తగ్గించేందుకు చైనా స్టేట్ కౌన్సిల్ 18 అంశాలతో కూడిన ఉపాధి రక్షణ ప్రణాళికను ప్రకటించింది.

బీజింగ్: ఏఐ సాంకేతికతను అమలు చేసే ముందు సంస్థలు ఉద్యోగాలపై దాని ప్రభావాన్ని అంచనా వేయాలని, ఉద్యోగ కోతలు తప్పనిసరి అయ్యే పరిస్థితుల్లో బాధితులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం కంపెనీలు తమ కార్యకలాపాల్లో ఏఐని ప్రవేశపెట్టే ముందే ఉపాధిపై పడే ప్రభావాన్ని పరిశీలించాలి. ఎన్ని ఉద్యోగాలు ప్రభావితమవుతాయి? ఎంతమంది కార్మికులు తరువాయి 2 వ పేజీలో...

చెత్త కనిపించొద్దు

భాగ్యనగరం పరిశుభ్రంగా ఉండాలి

ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూడాలి.. అధికారులకు రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): హైదరాబాద్ రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించకూడదని, ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు.. నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పరిశుభ్రమైన, ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో తరువాయి 2 వ పేజీలో...



మల్లారెడ్డి అక్రమ కట్టడాలు!

ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో తొలగించిన హైడ్రా

హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): ఫాక్స్ సాగర్ చెరువు అభివృద్ధి, పునరుద్ధరణ లక్ష్యంగా హైడ్రా ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టింది. చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వచ్చిన అక్రమ నిర్మాణాలను సోమవారం తొలగించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏకంగా అర కిలోమీటరు మేర బండ్ నిర్మించడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించింది. ఆ బండ్‌ను హద్దుగా చేసుకుని ఫామ్‌హౌస్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ప్రహరీని కూల్చివేసింది. మరికొన్ని చోట్ల హద్దులుగా ఏర్పాటు చేసిన ఇనుప కంచెలను సైతం తొలగించింది. ఫాక్స్ సాగర్‌కు మరోవైపు దూలపల్లి గ్రామ పరిధిలో ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మాజీ మంత్రి మల్లారెడ్డి కుటుంబీకులకు చెందిన ఫామ్‌హౌస్ ప్రహరీని కూడా హైడ్రా తొలగించింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో మట్టిని నింపి ప్రహరీ నిర్మించడంతో పాటు గేటు ఏర్పాటు చేయడాన్ని అధికారులు గుర్తించారు. సర్వే నంబరు 124లోని ఎఫ్‌టీఎల్ పరిధిని పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారించడంతో ప్రహరీ, గేటును తొలగించినట్లు హైడ్రా స్పష్టం చేసింది. దాదాపు 15 ఎకరాల మేర చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు
3.11.2026

మేషం: ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత అధికమవుతుంది. ఉద్యోగాలలో ఊహించని స్థానచలన సూచనలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి.

వృషభం: చిన్ననాటి మిత్రులతో కీలక విషయాలు చర్చిస్తారు. వ్యాపార విస్తరణకు నూతన పెట్టుబడులు అందుతాయి. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నిరుద్యోగుల ఆశలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో సహోద్యోగుల సహాయంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాల్లో లాభాలు అందుకుంటారు.

మిథునం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార వ్యవహారాలలో సొంత నిర్ణయాలు కలసివస్తాయి. ఉద్యోగాలలో మరింత అనుకూల వాతావరణం ఉంటుంది. ఇంటాబయట నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

కర్కాటకం: బంధువర్గం నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో అవాంతరాలు చికాకు పరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి. దైవసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

సింహం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యయ ప్రయాసలతో కొన్ని పనులు పూర్తి కావు. వృధా ఖర్చుల విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

కన్య: సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పెరుగుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగమున మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

తుల: సమాజంలో ప్రత్యేక గౌరవ మర్యాదలు పొందుతారు. నిరుద్యోగులు ఆశించిన పురోగతి సాధిస్తారు. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

వృశ్చికం: కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. చేపట్టిన పనులలో అవరోధాలు తప్పవు. వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు మందగిస్తాయి. వృత్తి , ఉద్యోగాలు కాస్త నిరాశ కలిగిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. దూరపు బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి.

ధనస్సు: ముఖ్యమైన పనులు కొన్ని వాయిదా వేస్తారు. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది. బంధువులతో అకారణ విభేదాలు కలుగుతాయి. వ్యాపారాలు నిరుత్సాహ పరుస్తాయి. ఉద్యోగ స్థానచలన సూచనలున్నాయి.

మకరం: దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మరింత మెరుగ్గా ఉంటుంది.

కుంభం: బంధువులతో అకారణ విభేదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. చేపట్టిన పనులలో కొంత జాప్యం కలుగుతుంది. ఉద్యోగమున అధికారుల నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వ్యాపారాలలో సమస్యలు తప్పవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

మీనం: వ్యాపారాల్లో అంచనాలు నిజం కాగలవు. పనులు చకచకా పూర్తి చేస్తారు. ఉద్యోగమున మీ పనితీరుతో అధికారులను సైతం ఆకట్టుకుంటారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహాన్నిస్తాయి. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు విస్తృతమవుతాయి.

రాహుల్‌కు కప్పం

మొదటి పేజీ తరువాయి

చరిత్రను ప్రస్తావించిన అమిత్ షా.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. నాడు నిజాం పాలకుడిని లొంగదీసుకుని హైదరాబాద్‌కు విముక్తి కల్పించింది పటేల్ చొరవేనని అన్నారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలను ప్రస్తావిస్తూ బీజేపీ కార్యకర్తల్లో రాజకీయ సంకల్పాన్ని పెంచే ప్రయత్నం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన 'ఓటు బచావో' ర్యాలీపై అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. అది ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించిన కార్యక్రమం కాదని.. చొరబాటుదారులను కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నమని ఆరోపించారు. రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా అక్రమ చొరబాటుదారులకు ఓటు హక్కు దక్కకుండా చూస్తామని వ్యాఖ్యానించారు. మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా.. ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓట్లు ఉన్నవారిని గుర్తించాలా.. నకిలీ ఓట్లను తొలగించాలా.. అంటూ అమిత్ షా ప్రశ్నలు సంధించారు. దేశంలో నివసించని వారు, అర్హత లేని వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో ఉండకూడదని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్ వ్యతిరేకించడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలో ఉన్న అక్రమ నమోదులను తొలగించేందుకు చేపట్టిన ప్రక్రియను రాజకీయంగా అడ్డుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని అమిత్ షా ఆరోపించారు.

ఎస్ఐఆర్ ద్వారా పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించారన్న ప్రతిపక్షాల విమర్శలను కేంద్రమంత్రి తోసిపుచ్చారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, రాహుల్ గాంధీ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడల్లా ఈవీఎంలపై విమర్శలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఈవీఎంలలో లోపాలు ఉంటే తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎలా అధికారంలోకి వచ్చిందని ప్రశ్నించారు. కేరళ, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ లేదా బీజేపీయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయని నిలదీశారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ లేకుండానే కేంద్రంలో నరేంద్ర మోదీ విజయం సాధించారని గుర్తుచేశారు. ప్రజల మద్దతుతోనే బీజేపీ ఎన్నికల్లో గెలుస్తోందని అన్నారు. ఈవీఎంలు, ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు పార్లమెంట్ వేదికగా సమాధానం చెప్పేందుకు సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ గత పదేళ్ల కేంద్ర పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని అమిత్ షా ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రజాదరణ కోల్పోతోందని విమర్శించారు. మాక్ పార్లమెంట్ పేరుతో ప్రతిపక్షాలు చేస్తున్న కార్యక్రమాలను కూడా ఆయన తప్పుబట్టారు. సోనియా గాంధీని ఉద్దేశించి సెటైర్లు వేశారు. మాక్ పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా వ్యవహరించడం కంటే ప్రధానిగా వ్యవహరిస్తే ఆమెకు మనశ్శాంతి ఉంటుందంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని అమిత్ షా ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చారని.. ఇక్కడ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ట్యాక్స్ వసూలు చేస్తున్నారని విమర్శించారు. 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు ఎక్కడికి వెళుతున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ అవినీతిని అడ్డుకోవడం బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల వల్ల సాధ్యం కాదని.. బీజేపీ మాత్రమే అడ్డుకోగలదని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేయడం లేదని కూడా విమర్శించారు. పేదలు, రైతులు, యువత సంక్షేమానికి బీజేపీ కట్టుబడి ఉంటుందని చెప్పారు. దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించి బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని అమిత్ షా పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, అరాచకత్వాన్ని అంతం చేయాలని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు.

తాగి తన్నుకున్నారు!

మొదటి పేజీ తరువాయి

'ఓట్ బచావో-దేశ్ బచావో' సభకు హాజరయ్యేందుకు వెళ్లిన కాంగ్రెస్ నేతలు సంగ్రిలా హోటల్‌లో బస చేశారు. ఈ క్రమంలో హోటల్ లాబీలో ఎమ్మెల్యేలు ఉన్న సమయంలో మంత్రి దామోదర రాజనర్సింహ.. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుపై అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, రూమ్‌లోకి తీసుకెళ్లి కొడతానంటూ బెదిరించినట్లు సమాచారం. ఈ పరిణామంతో అక్కడే ఉన్న పలువురు ఎమ్మెల్యేలు విస్మయానికి గురైనట్లు తెలుస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధి పట్ల సీనియర్ మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి భాషను ఉపయోగించారనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. జుక్కల్ నియోజకవర్గంలో ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు ఈ ఘటన తీవ్ర మనస్తాపం కలిగించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రజల ఆశీస్సులతో ఎన్నికైన ప్రజాప్రతినిధిని వ్యక్తిగతంగా దూషించడం, బెదిరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లో కొనసాగుతున్న ఎమ్మెల్యే వ్యక్తిత్వాన్ని, ప్రజల్లో ఆయనకున్న గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సమంజసం కాదని ఆయన అనుచరులు, పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నా పరస్పర గౌరవం, సంయమనం పాటించడం ప్రజాస్వామ్యంలో అత్యంత అవసరమని వారు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు తక్షణమే స్పందించినట్లు సమాచారం. జరిగిన పరిణామాలను కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి వివరించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై తన అభ్యంతరాలను తెలియజేస్తూ ఫిర్యాదు కూడా చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఒక ప్రజాప్రతినిధిగా తన ఆత్మగౌరవానికి భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమనే స్పష్టమైన వైఖరితో ఎమ్మెల్యే పార్టీ నాయకత్వాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. తనకు జరిగిన అవమానంపై న్యాయం జరగాలని, పార్టీ అంతర్గతంగా ఈ వ్యవహారాన్ని సమీక్షించాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం, పార్టీ అధిష్ఠానం స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. ఆరోపణలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడేలా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల కోసం పనిచేస్తున్న ఎమ్మెల్యేలకు పార్టీలో గౌరవప్రదమైన వాతావరణం ఉండాలని, నాయకుల మధ్య విభేదాలు ఉన్నా అవి పరస్పర గౌరవంతో పరిష్కరించుకోవాలని జుక్కల్ నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



లక్షమందికి ఫ్రీగా ఏఐ ట్రైనింగ్‌ద

మొదటి పేజీ తరువాయి

ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగ మార్కెట్‌లో వేగంగా ప్రాధాన్యం పెరుగుతున్న ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలపై యువతకు అవగాహనతో పాటు ప్రాక్టికల్ అనుభవం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ వంటి విభాగాల్లో ట్రైనింగ్ ఇవ్వనున్నారు. కేవలం క్లాస్ రూం పాఠాలకే పరిమితం కాకుండా.. ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కన్సోల్ ద్వారా ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశాన్ని కూడా విద్యార్థులకు కల్పిస్తారు. దీనివల్ల విద్యార్థులు రియల్ టైమ్ టెక్నాలజీపై పనిచేసే అనుభవాన్ని పొందవచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులకే కాకుండా ఆర్ట్స్, కామర్స్ వంటి నాన్ స్టెమ్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్‌లు అందుబాటులో ఉంటాయి. అంటే టెక్నికల్ విద్యను చదవని విద్యార్థులు కూడా.. వారు చదువుకున్న విద్యకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలపై నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. ఈ ట్రైనింగ్ తీసుకునే విద్యార్థులకు ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా ఏడాది పాటు 900కు పైగా డిజిటల్ కోర్సులను ఫ్రీగా అందించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లను కూడా ఇవ్వనున్నారు. అలాగే సాంకేతిక రంగ నిపుణులతో ప్రత్యేకంగా ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు, హ్యాకథాన్‌లు నిర్వహించనున్నారు. వీటి ద్వారా పరిశ్రమల అవసరాలు, కొత్త టెక్నాలజీల వినియోగం, సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. సక్సెస్‌ఫుల్‌గా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. విద్యార్థులతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొనే కాలేజీల అధ్యాపకులకు కూడా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలపై శిక్షణ అందించనున్నారు. తద్వారా కాలేజీల్లో సాంకేతిక విద్యా బోధన సామర్థ్యాన్ని పెంచేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థులకు అందించే శిక్షణ మరింత సమర్థంగా కొనసాగేందుకు అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కూడా దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంగా ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలోని లక్ష మంది విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ రంగాల్లో శిక్షణ పొందే అవకాశం లభించనుంది. ముఖ్యంగా సంప్రదాయ డిగ్రీ కోర్సులు చదువుతున్నవారికి కూడా కొత్త సాంకేతిక రంగాల్లోకి అడుగుపెట్టేందుకు ఇది ఒక అవకాశంగా నిలవనుంది.

మెట్రో-2కు కేంద్రం 275 కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో రెండో దశ నిర్మాణ పనుల కోసం రూ.150 కోట్లు.. మెట్రో ప్రాజెక్టు రుణాల చెల్లింపుల కోసం మరో రూ.125 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధుల కేటాయింపు ద్వారా మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక అవసరాలను కొంతవరకు సమకూర్చడంతో పాటు విస్తరణ పనులపై ముందడుగు వేసేందుకు అవకాశం ఏర్పడనుంది.

చెత్త కనిపించొద్దు

మొదటి పేజీ తరువాయి

పారిశుధ్య నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సోమవారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పారిశ్రామిక ప్రాంతాల్లో పారిశుధ్యం వంటి అంశాలపై చర్చించారు. నగరంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సీఎం ఆదేశించారు. ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేలా పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కేవలం చెత్త సేకరణకే పరిమితం కాకుండా, సేకరించిన వ్యర్థాలను సక్రమంగా తరలించే బాధ్యతను కూడా అధికారులు తీసుకోవాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపించే సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో భవన నిర్మాణాలు, రోడ్ల పనుల కారణంగా వెలువడే వ్యర్థాలు కూడా పారిశుధ్య సమస్యలకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో నిర్మాణ వ్యర్థాలను పడేయకుండా తగిన పర్యవేక్షణ ఉండాలని చెప్పారు.

ఫైనల్ కాపీ ఉంటేనే సెన్సార్ సర్టిఫికెట్

మొదటి పేజీ తరువాయి

మార్పులు చేసే అవకాశం ఉంటుందని, అవసరమైతే టైటిల్‌ను మార్చే అధికారం సీబీఎఫ్‌సీకి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు సినిమా లేదా ఇతర కంటెంట్‌కు సర్టిఫికేషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకునే వారందరికీ కేంద్ర సెన్సార్ సర్టిఫికేషన్ బోర్డు కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది.

హెచ్ఐవీ జెనెరిక్‌కు అమెరికా ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ప్రముఖ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఈ జెనెరిక్ వెర్షన్‌ను రూపొందించింది. ఈ అనుమతి ద్వారా సుమారు 120 అల్ప, మధ్యఆదాయ దేశాలకు అత్యంత తక్కువ ధరకే అంటే ఏడాదికి ఒక వ్యక్తికి సుమారు 40 డాలర్లతో ఈ ఔషధం అందుబాటులోకి రానుంది. రోజువారీ వేసుకునే మాత్రల ఇబ్బంది లేకుండా, 6 నెలలకు ఒకసారి ఇచ్చే ఈ ఇంజెక్షన్ హెచ్ఐవీ సంక్రమణను అడ్డుకోవడంలో 100 శాతం సమర్థతను ప్రదర్శించినట్లుగా క్లినికల్ ట్రయల్స్ ద్వారా నిరూపితమైంది. సాధారణంగా ఒరిజినల్ ఔషధం వచ్చిన పదేళ్ల తర్వాత జెనెరిక్ ఆమోదం లభిస్తుంది. కానీ, అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా కేవలం 16 నెలల్లోనే జెనెరిక్ ఔషధానికి ఆమోదం లభించడం వైద్య రంగంలో చారిత్రాత్మక విజయంగా నిపుణులు కొనియాడుతున్నారు.

చైనాలో ఏఐ రూల్ బుక్

మొదటి పేజీ తరువాయి

ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కోవాల్సి వస్తుంది? అనే అంశాలపై ముందస్తు అంచనా వేయాలి. ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉన్నవారికి ముందుగానే సమాచారం అందించడంతోపాటు, కొత్త విధుల్లో పనిచేసేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇవ్వాలి. ఇతర ఉద్యోగాల్లోకి మారేందుకు సంస్థలే తగిన సహకారం అందించాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఏఐ ద్వారా కొత్త ఉద్యోగాల సృష్టి, ఉపాధికి అనుకూలమైన విధానాల రూపకల్పన, కార్మికుల్లో డిజిటల్ నైపుణ్యాల పెంపు, ఉపాధి సేవల బలోపేతం, కార్మిక హక్కుల పరిరక్షణ, ఉద్యోగ నష్టాల పర్యవేక్షణ.. ఇలా ఆరు ప్రధాన రంగాలకు ఈ ప్రణాళికలో ప్రాధాన్యం ఇచ్చారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా కార్మికులను సిద్ధం చేయడంతోపాటు, ఉపాధి అవకాశాలు తగ్గకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తాత్కాలిక, సౌకర్యవంతమైన ఉపాధి మార్గాల్లో పనిచేసేవారితోపాటు కొత్త తరహా ఉద్యోగాల్లో ఉన్నవారికీ సామాజిక భద్రత కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఏఐ వల్ల సంస్థలకు లభించే ఆర్థిక ప్రయోజనాల్లో కార్మికులకూ న్యాయమైన వాటా దక్కేలా ఆదాయ పంపిణీ విధానాల్లో మార్పులు తీసుకురావాలని ప్రతిపాదించింది. ఉద్యోగాలు కోల్పోయిన అర్హులైన కార్మికులకు నిరుద్యోగ భృతి అందేలా చర్యలు చేపట్టనుంది. కార్మికుల కొరత ఉన్న రంగాలు, ప్రమాదకరమైన పని ప్రదేశాల్లో భద్రతను పెంచేందుకు ఏఐ ఆధారిత సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహించనుంది. మరోవైపు చైనాలో ఏఐ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం 2025 నాటికి ఆ దేశ ప్రధాన ఏఐ పరిశ్రమ విలువ 1.2 ట్రిలియన్ యువాన్లను దాటింది. దేశవ్యాప్తంగా 6,200కు పైగా ఏఐ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అదే ఏడాది చివరి నాటికి వార్షిక ఆదాయం 20 మిలియన్ యువాన్లకు మించిన తయారీ రంగ సంస్థల్లో 30 శాతానికి పైగా ఏఐ సాంకేతికతలను వినియోగంలోకి తెచ్చాయి. సాంకేతిక అభివృద్ధితో ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తున్నప్పటికీ, అదే సమయంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఏఐ పురోగతిని కొనసాగిస్తూనే కార్మికుల ఉపాధి, ఆదాయం, హక్కులకు భరోసా కల్పించడమే చైనా 18 అంశాల ప్రణాళిక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. సాంకేతికతను స్వీకరించే క్రమంలో ఉద్యోగుల భవిష్యత్తును విస్మరించకూడదనే సందేశాన్ని ఈ నిర్ణయం ప్రపంచ దేశాలకు అందిస్తోంది.

మల్లారెడ్డి అక్రమ కట్టడాలు!

మొదటి పేజీ తరువాయి

చొచ్చుకుపచ్చేలా ప్రహరీ నిర్మించినట్లు గుర్తించినట్లు తెలిపింది. జీడిమెట్ల పరిధిలోని సర్వే నంబర్లు 41, 42లో ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చిన దాదాపు 20 ఎకరాల మేర ప్రహరీని కూడా హైడ్రా తొలగించింది. ఈ చర్యలను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు న్యాయవాది సౌరభ్‌రాజ్ వర్మ ప్రయత్నించినట్లు సమాచారం. తన తండ్రి దీపక్ వర్మ, పినతండ్రి ప్రశాంత్ వర్మల వారసుడిగా పేర్కొంటూ ఆయన అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులను చూపించి ప్రహరీని తొలగించారు. ఫాక్స్ సాగర్ చెరువు పరిధిలో ఆక్రమణలను తొలగించి పునరుద్ధరణ పనులకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా హైడ్రా ఈ చర్యలు చేపట్టింది.

బిడ్డ కోసం తల్లిదండ్రుల ఆవేదన

మొదటి పేజీ తరువాయి

చేసినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తల్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. శిశు సంరక్షణ కేంద్రంలో బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి తమ బిడ్డను వెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. హైకోర్టు జారీ చేసిన ఇంటరిమ్ రిలీఫ్ ఉత్తర్వుల మేరకు బాలుడిని దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు అప్పగిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

– జగిత్యాల బ్యూరో, నవంబర్ 2 (ఈవార్తలు)

ఆస్తి కోసం కన్న తండ్రి హత్య

మొదటి పేజీ తరువాయి

దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. అనంతరం నిందితుడు బైక్‌పై పరారయ్యాడు. గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో తలదాచుకున్న లక్ష్మణ్ పోలీసుల గాలింపు విషయం తెలుసుకుని నవంబరు 2న ధర్మపురి పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. నిందితుడి సమాచారంతో హత్యకు ఉపయోగించిన రెండు బండరాళ్లు, కర్ర, పల్సర్ ద్విచక్రవాహనం, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు.

– ధర్మప

11 నుంచి కేటీఆర్ బస్సుయాత్ర

29న 50వేల మందితో భారీ బహిరంగ సభ



హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్న వేళ బీఆర్ఎస్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో నవంబర్ 11వ తేదీ నుంచి బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించింది. గోదావరి జలాలు, సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాన అంశాలుగా తీసుకుని ఈ యాత్ర సాగనుంది. మరోవైపు.. తెలంగాణ ఉద్యమంలోని కీలక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు సుమారు 50 వేల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వెల్లడించారు. కేటీఆర్ బస్సు యాత్ర నవంబర్ 11వ తేదీ నుంచి 14వ తేదీ మధ్య 2 రోజులపాటు నిర్వహించనున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని శ్వేతా హోటల్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో బస్సు యాత్ర మార్గం, దీక్షా దివస్ సభ నిర్వహణ, రైతుల సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే కేటీఆర్ బస్సు యాత్ర గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా కొనసాగనుంది. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు వాటి ద్వారా సాగునీరు అందే ప్రాంతాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తోంది. సాగునీటితో పాటు తాగునీరు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కూడా యాత్రలో ప్రస్తావించనున్నారు. సాగునీటి అంశాన్ని రాజకీయ చర్చలోకి తీసుకురావడం ద్వారా రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని గులాబీ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులు, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రజలకు వివరించేందుకు ఈ యాత్రను వేదికగా చేసుకోనున్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్షకు సంబంధించిన జ్ఞాపకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నవంబర్ 29వ తేదీన దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. 2009 నవంబర్ 29వ తేదీన అప్పటి ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను అలుగునూర్ వద్ద పోలీసులు అరెస్టు చేసిన ఘటనను ఈ సందర్భంగా గుర్తుచేయనున్నారు. ఈ చారిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతంలోనే సభ నిర్వహించాలని పార్టీ యోచిస్తోంది. మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని అలుగునూర్ లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో సభ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు గంగుల కమలాకర్ తెలిపారు. ఈ దీక్షా దివస్ కార్యక్రమానికి సుమారు 50 వేల మందిని సమీకరించాలని బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు గంగుల చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దీక్షా దివస్‌కు ఉన్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంపై దృష్టి పెట్టనున్నారు. బస్సు యాత్ర, దీక్షా దివస్ సభ ఏర్పాట్ల, యాత్రలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసుకోవడం, ప్రాజెక్టుల పరిస్థితిపై వివరాలు సేకరించడం, సభకు జనసమీకరణ వంటి అంశాలపై నేతలు తాజాగా చర్చించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 3 ఏళ్లు కావస్తుండగా.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 2 ఏళ్ల సమయం ఉంది. ఈ నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. బీజేపీ కూడా రాష్ట్రంలో కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ బస్సు యాత్ర, దీక్షా దివస్ సభకు ప్రాధాన్యత ఏర్పడింది. మొత్తంగా మేడిగడ్డ నుంచి గోదావరి బేసిన్ వరకు కేటీఆర్ బస్సు యాత్ర, అలుగునూర్ ప్రాంతంలో దీక్షా దివస్ సభతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి నీటి ప్రాజెక్టులు, రైతుల సమస్యలు ప్రధాన చర్చకు వచ్చే అవకాశం ఉంది.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



రేవంత్ వల్లే పాలమూరులో కరువు

రైతులను ఆదుకోవడంలో విఫలం.. మాజీమంత్రి హరీశ్ రావు

వనపర్తి, నవంబర్ 2 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పాలమూరు ప్రాంతంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. శ్రీశైలం, జూరాల నుంచి అందుబాటులో ఉన్న కృష్ణా జలాలను పూర్తిస్థాయిలో వినియోగించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఎనిమిదేళ్ల పాటు రెండు పంటలు పండిన ప్రాంతంలో ఈసారి తొలి పంట కూడా ఎండిపోయిందని అన్నారు. "కృష్ణా నీటిని ఎత్తుకుండా పాలమూరుకు కరువు తీసుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ పంటలు ఎండిపోలేదు. ప్రజలకు భరోసా ఇవ్వడంలో రేవంత్ రెడ్డి విఫలం అయ్యారు. కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వచ్చాయి. కాంగ్రెస్ చేసిన పాపం ప్రజలకు శాపంగా మారింది. ప్రజల సంక్షేమం సీఎం రేవంత్‌కు పట్టదని, కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు" అని హరీష్ రావు మండిపడ్డారు. అంతేకాదు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా గతంలో 50 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని విమర్శించారు. శ్రీశైలం, జూరాల నుంచి వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కరువుతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం, యాసంగి రైతుబంధు అందించాలని ఆయన కోరారు. కరువు మండలాల ప్రకటనకే ప్రభుత్వం పరిమితమైందని, కరువు పరిస్థితులను పరిశీలించేందుకు తక్షణమే కేంద్ర బృందాన్ని పంపించాలని డిమాండ్ చేశారు. రైతులకు ధైర్యం చెప్పేందుకే తాము పర్యటిస్తున్నామని తెలిపారు.

రాప్తాడు బాధిత కుటుంబానికి 50 లక్షలు ఇవ్వాలి

కూటమి ప్రభుత్వం ఆదుకోకపోతే మేం ఉన్నాం: జగన్

రాప్తాడు, నవంబర్ 2 (ఈవార్తలు): ఏపీలోని సత్యసాయి జిల్లా రాప్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో దాడికి గురైన బాలిక కుటుంబాన్ని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. బాలిక ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆయన ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని మాజీ సీఎం జగన్ డిమాండ్ చేశారు. ఒక వేళ ఇవ్వకపోతే తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని, రూ.50 లక్షల నష్ట పరిహారం అందిస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఒక ప్రభుత్వ స్కూల్లో ఇలాంటి దారుణం జరగడానికి రెడ్ బుక్ రాజ్యాంగమే కారణమని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలోకి సంబంధం లేని వ్యక్తి ఎలా వచ్చాడని ప్రశ్నించారు. ప్రభుత్వ తప్పిదాలతోనే ఈ ఘటన జరిగిందని, గంజాయి, మద్యం విచ్చలవిడి అమ్మకాలతో ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. అంతేకాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, ఇలాంటివి మళ్లీ మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

11వ నెల 11న పార్టీ ప్రకటన

ఎవరో భుజాలు తడుముకుంటే నేనేం చేయలేను

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

విజయవాడ, నవంబర్ 2 (ఈవార్తలు): తాను 11వ నెల 11వ తేదీన 11 గంటలకు పార్టీని ప్రకటిస్తానని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మరోసారి స్పష్టం చేశారు. విజయసాయిరెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన.. ఆ రోజు .. ఆ టైమ్‌కి ముహూర్తం బాగుందని చెప్పడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. "నేను ముహూర్త బలాన్ని నమ్ముతాను.. దానికి ఎవరో భుజాలు తడుముకుంటే నేనేం చేయలేను" అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శ్రేయస్సు, డెవలప్‌మెంటే లక్ష్యంగా మూడో ప్రత్యామ్నాయం వస్తుందని, త్వరలోనే పార్టీ విధివిధానాలను ప్రకటిస్తానని విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు. అలాగే అన్ని వర్గాల వారీకి అధికారం కట్టబెట్టేలా పని చేస్తానని చెప్పారు. ఈనెల 11వ తేదీన కొత్త పార్టీ పేరును ప్రకటిస్తానని మరోసారి స్పష్టం చేశారు.

పదవి లేదు.. నిధులూ లేవు

సొంత ప్రభుత్వంపై కోమటిరెడ్డి ఆగ్రహం



గట్టుప్పల్, నవంబర్ 2 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్‌లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సొంత ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆవేదన వెలిబుచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి అడిగినా నియోజకవర్గానికి నిధులు రావడం లేదని వాపోయారు. అవసరమైతే ఎమ్మెల్యే పదవిని సైతం త్యాగం చేస్తానంటూ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో మరోసారి చర్చకు దారితీశాయి. గట్టుప్పల్ మండలంలో పర్యటించిన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవిపై మాట్లాడారు. పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని, అయినప్పటికీ మనసు చంపుకొని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తే ఎక్కడికో వెళ్లిపోతాననే ఉద్దేశంతోనే ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా పోరాడాల్సి వస్తోందన్నారు. రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని, దీంతో పనులు మధ్యలోనే నిలిచిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుత పనులకే నిధులు ఇవ్వకపోతే కొత్త పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. జీతాలు, రైతు భరోసా వంటి పథకాలకు నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు. మునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవిని వదులుకోవడానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు. గతంలో తాను కష్టపడి గెలిపించిన పలువురు నేతలు తనను మోసం చేశారని ఆరోపించారు. ఎవరికీ భయపడేది లేదని, రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. రాజగోపాల్‌రెడ్డి తాజా వ్యాఖ్యలతో సీఎం రేవంత్‌రెడ్డితో ఆయనకు విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. గతంలోనూ ఇద్దరి మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరుకావడంతో పరిస్థితులు సద్దుమణిగాయని కాంగ్రెస్ వర్గాలు భావించాయి. అయితే రేడియల్ రోడ్ల టెండర్ల వ్యవహారం మళ్లీ వివాదానికి కారణమైంది. తన కుటుంబానికి చెందిన కంపెనీని ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపిస్తూ ఆయన న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకా? లేక సీఎం రేవంత్‌రెడ్డితో మరోసారి నేరుగా తలపడేందుకు సంకేతమా? అన్న చర్చ మొదలైంది. ఇటీవల నిధుల విషయంలో జడ్పర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై పార్టీ నాయకత్వం ఎలా వ్యవహరిస్తుందో చూడాలి.

ఓబీసీ గణనపై తీర్మానం చేయండి

హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): జాతీయ జనగణనలో ఓబీసీల కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఓబీసీ కులగణనతో పాటు, ఆదివాసీల మతాన్ని నమోదు చేసేందుకు కూడా ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

'మురసు' తుఫాను కల్లోలం

ఏపీలోని ప్రకాశం జిల్లాలో హైఅలర్ట్

వైజాగ్, నవంబర్ 2 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుఫాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. తీర ప్రాంత ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తూ, ఇది క్రమంగా బలపడుతోంది. ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ , రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ సోమవారం రాత్రి 8:20 గంటలకు విడుదల చేసిన తాజా బులెటిన్ ప్రకారం, ఈ తుఫాను గత ఆరు గంటలుగా గంటకు 13 కిలోమీటర్ల వేగంతో పయనిస్తోంది. ప్రస్తుతం ఇది కావలికి కేవలం 70 కిలోమీటర్ల దూరంలో, నెల్లూరుకు 80 కిలోమీటర్లు, ఒంగోలుకు 90 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. బాపట్ల, మచిలీపట్నం పట్టణాలకు 120 నుంచి 170 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. తుఫాను తీరం దాటే సమయంలో పెను విధ్వంసం సృష్టించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. తీరాన్ని సమీపించే కొద్దీ గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ గాలుల తీవ్రతకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉందని, సమాచార వ్యవస్థలకు అంతరాయం కలగవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు. తుఫాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారి, అలలు ఉవ్వెత్తున ఎగిసిపడే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా, మురసు తుఫాను ప్రభావం ప్రకాశం జిల్లాపై అధికంగా ఉండే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. జిల్లాలోని పలు మండలాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. కొత్తపట్నం, ఒంగోలు రూరల్, చినగంజాం మండలాల్లో అత్యంత భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని రెడ్ అలర్ట్ జారీ చేసింది. వీటితో పాటు నాగులుప్పాడు, ఒంగోలు అర్బన్, వేటపాళెం, టంగుటూరు, సింగరాయకొండ, ఉలవపాడు, మద్దిపాడు, గుడ్లూరు, జరుగుమిల్లి, సంతనూతలపాడు, కందుకూరు మండలాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ హెచ్చరికల నేపథ్యంలో ప్రకాశం జిల్లా యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. పైన పేర్కొన్న మండలాల్లోని ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు.



ఆలోచనే అసలైన సృజనాత్మకత

వ్యాసరచనతో విద్యార్థుల్లో మేధోవృద్ధి.. మేడ్చల్ ఎంఈవో శంకరయ్య వెల్లడి

న్యూ లిటిల్ లిల్లీ హైస్కూల్‌లో ఘనంగా 'కథా కార్యశాల'



మేడ్చల్, నవంబర్ 2 (ఈవార్తలు): విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం, సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించడం ద్వారా వారి మేధో వికాసానికి బాటలు వేయవచ్చని మేడ్చల్ ఎంఈవో శంకరయ్య అన్నారు. మనిషి ఆలోచనలే అసలైన సృజనాత్మకతకు మూలమని, విద్యార్థులు తమలోని భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించేందుకు రచన మంచి సాధనమని పేర్కొన్నారు. పుస్తక పఠనం, కథల రచన, వ్యాసరచన వంటి కార్యక్రమాలు పిల్లల్లో కొత్త ఆలోచనలకు పదును పెట్టడంతోపాటు భాషా నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని వివరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో మేడ్చల్‌లోని న్యూ లిటిల్ లిల్లీ హైస్కూల్‌లో విద్యార్థుల కోసం 'కథా కార్యశాల'ను ఘనంగా నిర్వహించారు. పిల్లల్లో సాహిత్యంపై అవగాహన పెంపొందించడం, సృజనాత్మక రచనా నైపుణ్యాలను వెలికితీయడం, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, కథా రచన పోటీలను నిర్వహించారు. విద్యార్థులు తమ చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలిస్తూ, నిత్యజీవితంలో ఎదురయ్యే అనుభవాలను కథలుగా, వ్యాసాలుగా మలచుకునేలా ప్రోత్సహించడం ఈ కార్యశాల ప్రధాన ఉద్దేశం. 'పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని గుర్తించి, దానికి సరైన దిశానిర్దేశం చేయడం ద్వారా భవిష్యత్తులో మంచి రచయితలుగా ఎదిగే అవకాశాలు కల్పించవచ్చు. వ్యాసరచన ద్వారా ఒక అంశంపై స్పష్టంగా ఆలోచించడం, విషయాలను క్రమబద్ధంగా వివరించడం, తమ అభిప్రాయాలను అక్షరాల రూపంలో వ్యక్తపరచడం వంటి నైపుణ్యాలు అలవడతాయి. కథా రచనతో ఊహాశక్తి, పరిశీలనా సామర్థ్యం, భాషపై పట్టు మరింత పెరుగుతాయి. ప్రస్తుత విద్యావిధానంలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతోపాటు సృజనాత్మకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. చిన్నతనం నుంచే సాహిత్యాన్ని పరిచయం చేయడం, రచనల పట్ల ఆసక్తి కలిగించడం ద్వారా పిల్లల్లో పఠనాభిరుచి పెరుగుతుంది. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదికగా నిలుస్తాయి. పోటీల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి కూడా కలుగుతుంది' అని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో వసుంధర విజ్ఞాన వికాస మండలి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తెలంగాణ సాహిత్య అకాడమీ, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఇతర సహకారులకు వసుంధర విజ్ఞాన వికాస మండలి కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో సాహితీవేత్తలు గరిపెల్లి అశోక్, వీఆర్ శర్మ, పైడిమర్రి గిరిజ, 'ఈవార్తలు' దినపత్రిక ఎడిటర్ బొమ్మకంటి శ్రావణ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్, శాంతి, ఇంచార్జి తిరుపతి, మండలి అధ్యక్షుడు మధుకర్ వైద్యుల, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అండెం, కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాక్ పార్లమెంట్‌లో హిమజ ప్రతిభ



జగిత్యాల, నవంబర్ 2 (ఈవార్తలు): హైదరాబాద్‌లో అక్టోబర్ 30, 31 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్ పోటీల్లో జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్ పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని హిమజ ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్. దినేష్ విద్యార్థినిని అభినందించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పిస్తాయని డీఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ ఎం. ప్రవీణ్, ప్రధానోపాధ్యాయుడు ఎ. అమర్‌నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొగాకు రహిత జిల్లాగా జగిత్యాల



60 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

జగిత్యాల, నవంబర్ 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాను పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. సుజాత తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బహుళ శాఖల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పొగాకు నియంత్రణ చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తే జరిమానాలు విధిస్తామని తెలిపారు. విద్యాసంస్థలను పొగాకు రహితంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే 60 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రామాభివృద్ధిలో కేసీఆర్ పథకాలు ఆదర్శం

బీఆర్ఎస్‌లో చేరిన లచ్చక్కపేట సర్పంచ్

జగిత్యాల, నవంబర్ 2 (ఈవార్తలు): కేసీఆర్ హయాంలో గ్రామాల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు సర్పంచులకు ఆదర్శంగా నిలుస్తాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. సారంగపూర్ మండలం లచ్చక్కపేట సర్పంచ్ రమ-భాస్కర్ బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా సోమవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, మిషన్ భగీరథ వంటి కార్యక్రమాలతో గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు నెలకొన్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ సర్పంచులు పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఏడాదిలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని, గ్రామాభివృద్ధికి చేసిన ఖర్చులను ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయుష్ ఉద్యోగాలకు ఈ నెల 6న పరీక్ష

జగిత్యాల, నవంబర్ 2 (ఈవార్తలు): ఆయుష్ విభాగంలో మల్టీపర్పస్ వర్కర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 6న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ సమీపంలోని సమావేశ మందిరం, గది నంబర్ 38లో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఎండింగ్ సమస్యలై అంగన్వాడీల పోరుబాట

జగిత్యాల, నవంబర్ 2 (ఈవార్తలు): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో కలెక్టరేట్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.



ఎస్సీ వర్గీకరణలో మాలలకు న్యాయం చేయాలి



మల్యాల, నవంబర్ 2 (ఈవార్తలు): ఎస్సీ వర్గీకరణ విధానంలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ జగిత్యాల జిల్లా మల్యాల మండల మాల మహానాడు కమిటీ నాయకులు సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ.. 2025 ఏప్రిల్ 14న కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ విధానం వల్ల 20 రోస్టర్ పాయింట్లలో మాలలకు ఒక్క పాయింట్ కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల మాల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు పదోన్నతుల విషయంలోనూ నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన 26 కులాలకు అదనంగా 2 శాతం రిజర్వేషన్ పెంచడంతో పాటు ఐదో, పన్నెండో రోస్టర్ పాయింట్లను కేటాయించాలని కోరారు. మాలలకు సముచిత న్యాయం జరిగేలా ప్రభుత్వం ఈ విధానంపై పునరాలోచించి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.



రోడ్డు కోసం ఎంపీ అర్వింద్‌కు వినతి

బీర్‌పూర్, నవంబర్ 2 (ఈవార్తలు): బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి నుంచి మంగేళ పెద్దమ్మ గుడి వరకు, అక్కడి నుంచి రంగసాగర్ వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రహదారులు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కోరారు. జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి నాయకత్వంలో ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ప్రతిపాదిత రహదారులు నిర్మిస్తే ఆయా గ్రామాల రైతులకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్, బీర్‌పూర్ మండల అధ్యక్షుడు ఆడెపు నర్సయ్య, జిల్లా కార్యదర్శి పాత రమేష్, పార్టీ నాయకులు, మంగేళ, కండ్లపల్లి, రంగసాగర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ధర్మ రక్షణకు దుర్గావాహిని సిద్ధం కావాలి

మహిళా శక్తి దేశ రక్షణలో కీలక పాత్ర పోషించాలి: ప్రగ్యా దీదీ.. 1,100 మంది కార్యకర్తలతో పాతబస్తీలో శక్తి సంచలన్ ర్యాలీ

హైదరాబాద్, నవంబర్ 2 (ఈవార్తలు): హిందూ ధర్మ పరిరక్షణ, దేశ రక్షణలో మహిళా శక్తి కీలక పాత్ర పోషించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) యువ మహిళా విభాగమైన దుర్గావాహిని అఖిల భారత కన్వీనర్ ప్రగ్యా దీదీ పిలుపునిచ్చారు. భాగ్యనగర్ పాతబస్తీలోని గౌలిపుర మిత్ర క్లబ్‌లో నిర్వహించిన హిందూ యువ మహిళల సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దుర్గావాహిని తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని వీహెచ్‌పీ పూర్వ నాయకుడు దివంగత అశోక్ సింగల్ శతజయంతి సందర్భంగా శక్తి వందన్, శక్తి సంచలన్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగ్యా దీదీ మాట్లాడుతూ.. ఝాన్సీ లక్ష్మీబాయి వీరత్వాన్ని, జిజియాబాయి మాతృత్వ సంస్కారాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దుర్గాదేవి స్ఫూర్తితో మహిళలు ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలు, లవ్ జిహాద్, బలవంతపు మతమార్పిడుల పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అక్రమ చొరబాట్లతో సంస్కృతిపై జరుగుతున్న దాడులను సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.



1,100 మందితో శక్తి సంచలన్

సమ్మేళనానికి ముందు యూనిఫామ్ ధరించిన 1,100 మంది దుర్గావాహిని కార్యకర్తలు పాతబస్తీలో భారీ ర్యాలీ నిర్వహించారు. 'జై శ్రీరామ్' నినాదాలు, కాషాయ జెండాలతో ర్యాలీ సాగింది. పలుచోట్ల స్థానికులు కార్యకర్తలపై పూలవర్షం కురిపించారు. లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కార్యకర్తలు ప్రదర్శించిన కర్రసాము, కత్తియుద్ధం, ముష్టియుద్ధ విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం, రాష్ట్ర సహకార్యదర్శి చింతల వెంకన్న, ఉపాధ్యక్షురాలు సునీతా రెడ్డి, ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ పగడాకుల బాలస్వామి, ప్రొఫెసర్ స్వప్న రెడ్డి, డాక్టర్ లలిత తదితరులు పాల్గొన్నారు.



వర్షకొండలో పీఏసీఎస్ కేంద్రం ఏర్పాటు చేయండి

కలెక్టర్‌కు కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ వినతి

జగిత్యాల, నవంబర్ 2 (ఈవార్తలు): ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌ను కోరారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న పీఏసీఎస్ కేంద్రాల పరిధిలో వర్షకొండ గ్రామాన్ని కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వర్షకొండతో పాటు పరిసర గ్రామాల రైతులు పీఏసీఎస్ సేవలు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులకు సౌకర్యంగా ఉండేలా గ్రామంలోనే కేంద్రం ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

Position	B&W Rate	Colour Rate
Front Page	Rs.550	Rs.1,000
Page 3 / Back Page	Rs.350	Rs.750
Inside Pages	Rs.250	Rs.500

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

COLOUR:
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com



పీఎఫ్ సేవలు ఇక వాట్సాప్‌లోనే

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) చందాదారులకు శుభవార్త. ఇకపై వాట్సాప్ ద్వారానే పీఎఫ్ ఖాతాలో ఎంత డబ్బు ఉందో తెలుసుకోవచ్చు. ఖాతాలో ఇటీవల జరిగిన ఐదు లావాదేవీల వివరాలను చూడటంతో పాటు పీఎఫ్ పాస్‌బుక్ సమాచారాన్ని కూడా పొందవచ్చు. ఈ కొత్త సదుపాయాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించారు. ఈ సేవలతో సాధారణ ఖాతా వివరాల కోసం ఈపీఎఫ్ కార్యాలయాలను సంప్రదించాల్సిన అవసరం తగ్గనుంది. ఈ సేవలను వినియోగించుకునేందుకు చందాదారులు ఈపీఎఫ్‌వో అధికారిక వాట్సాప్ సేవను మాత్రమే ఉపయోగించాలి. అందుబాటులో ఉన్న సేవల్లో పీఎఫ్ బ్యాలెన్స్ తెలుసుకోవడం, చివరి ఐదు లావాదేవీలను పరిశీలించడం, పాస్‌బుక్ వివరాలను పొందడం ఉన్నాయి. 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' (పీఎంవీబీఆర్‌వై)కు సంబంధించిన అవసరాలను పూర్తి చేసేందుకు వ్యక్తిగత మార్గదర్శకత్వం, సహాయం కూడా ఈ సేవ ద్వారా అందించనున్నారు. వాట్సాప్ సేవతో పాటు మరో కీలక నిర్ణయాన్ని ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఆధార్ ధ్రువీకరణ పూర్తయిన, నిలిచిపోయిన పీఎఫ్ ఖాతాల్లో రూ.1,000 లేదా అంతకంటే తక్కువ మొత్తం ఉన్న అర్హులైన చందాదారులకు డబ్బు తిరిగి చెల్లించే ప్రక్రియను ఆటోమేటిక్‌గా ప్రారంభించనున్నారు. ఇందుకోసం చందాదారులు ప్రత్యేకంగా క్లెయిమ్ దాఖలు చేయాల్సిన అవసరం ఉండదు. అయితే గుర్తింపు, బ్యాంకు ఖాతా వివరాల ధ్రువీకరణ పూర్తయ్యాకే ఈ ప్రక్రియ చేపడతారు. ఈ సదుపాయం ద్వారా సుమారు లక్ష ఖాతాలకు చెందిన రూ.5 కోట్ల వరకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా.

గ్రోక్‌తో ఖర్చే ఎక్కువ: మస్క్



న్యూయార్క్: ఉత్పాదకత పెంచుకోవడానికి కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వైపు చూస్తున్నాయి. అయితే, ఈ టెక్నాలజీ నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతుండటంతో సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సైతం ఇదే విషయంపై స్పందించారు. తన 'ఎక్స్' సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోని 'గ్రోక్' ఏఐ చాట్‌బాట్‌కు వస్తున్న ఆదాయం కంటే నిర్వహణ ఖర్చే ఎక్కువగా ఉందని ఆయన అంగీకరించారు. ఎక్స్‌లోని ప్రీమియం యూజర్లు కొందరు, తమ వారపు గ్రోక్ వినియోగ పరిమితి వేగంగా అయిపోతోందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై స్పందించిన ఒక యూజర్, ఈ లిమిట్‌ను రీసెట్ చేయాలని మస్క్‌ను కోరారు. ఈ నేపథ్యంలోనే మస్క్ పైవిధంగా స్పందించారు. సర్వర్ ఖర్చులు మరింత పెరగకుండా ఉండేందుకే వినియోగంపై కఠినమైన పరిమితులు విధించాల్సి వస్తోందని ఆయన వివరించారు. మరోవైపు, ఏఐ కోసం టెక్ కంపెనీలు చేస్తున్న అప్పులు విపరీతంగా పెరుగుతున్నాయని ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, టెస్లా వంటి దిగ్గజ సంస్థల మొత్తం అప్పు 2026 మధ్య నాటికి 578 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.54 లక్షల కోట్లు) చేరుకుందని తెలిపింది. 2025లో ఈ అప్పు 399 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ఏఐ టెక్నాలజీ అభివృద్ధి, నిర్వహణ ఎంత ఖర్చుతో కూడుకున్నదో స్పష్టం చేస్తోంది.

సైన్యం చేతిలోనే పాక్ విదేశాంగం: ఖవాజా

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో విదేశాంగ విధాన నిర్ణయాల్లో సైన్యం కీలక పాత్ర పోషిస్తోందని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అంగీకరించారు. పౌర ప్రభుత్వం, సైనిక నాయకత్వం కలిసి అధికారాన్ని పంచుకుంటున్నాయని పేర్కొన్నారు. దేశంలో అమలవుతున్నది సంప్రదాయ ప్రజాస్వామ్య పాలన కాదని, ఇది ఒక 'హైబ్రిడ్ వ్యవస్థ' అని వివరించారు. బ్రిటిష్-అమెరికన్ జర్నలిస్ట్ మెహ్దీ హసన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లో సైన్యాధిపతి అసిమ్ మునీర్‌కు ప్రభుత్వ పెద్దల కంటే ఎక్కువ అధికారం ఉందా? అన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. సైన్యం, పౌర నాయకత్వం మధ్య నిర్ణయాలు ఏకాభిప్రాయంతో జరుగుతాయని చెప్పారు. అయితే అధికార పంపిణీ సమానంగా లేదని కూడా అంగీకరించారు. దేశంలో సైన్యం పాత్రను ప్రస్తావిస్తూ.. గతంలో సైనిక పాలకుల కారణంగా ఈ వ్యవస్థ మరింత స్పష్టంగా కనిపించిందని ఆసిఫ్ అన్నారు. అమెరికాలోనూ ప్రభుత్వ నిర్ణయాల వెనుక 'డీప్ స్టేట్' ఉందని వ్యాఖ్యానించారు. అయితే పాకిస్థాన్‌లో ప్రస్తుతం సైనిక పాలన లేదని, సైన్యం ఎన్నికైన ప్రభుత్వానికి సహకరిస్తోందని ఆయన గతంలోనూ పలుమార్లు సమర్థించారు. 2025లో అరబ్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ ఆసిఫ్ పాకిస్థాన్ పాలనా విధానాన్ని 'హైబ్రిడ్ మోడల్'గా అభివర్ణించారు. సైనిక, పౌర నాయకత్వం కలిసి అధికారాన్ని నిర్వహిస్తున్నాయని, ఆర్థిక, పాలనా సమస్యల నుంచి దేశం బయటపడే వరకు ఈ విధానం అవసరమని పేర్కొన్నారు. సైన్యం, ప్రభుత్వం కలిసి పనిచేయడానికి ప్రత్యేక పెట్టుబడుల ప్రోత్సాహక మండలి వంటి ఉమ్మడి వేదికలు ఉన్నాయని వివరించారు. పాకిస్థాన్‌లో సైన్యం రాజకీయాలు, భద్రత, విదేశాంగ విధానాలపై దశాబ్దాలుగా ప్రభావం చూపుతోంది. 1958, 1977, 1999లో సైనిక తిరుగుబాట్ల ద్వారా నేరుగా అధికారాన్ని చేపట్టింది. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కూడా కీలక నిర్ణయాల్లో సైన్యం ప్రభావం కొనసాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రక్షణ మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఒమర్ అబ్దుల్లా రెండో పెళ్లి చెల్లదు.. ఫత్వా జారీ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ప్రముఖ జర్నలిస్ట్ నిధి రజ్దాన్‌ను వివాహం చేసుకోవడం మతపరమైన వివాదానికి దారితీసింది. వారి పెళ్లి ఇస్లామిక్ సూత్రాలకు విరుద్ధమని, అది చెల్లదని ఆల్ ఇండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా ముఫ్తీ షాహబుద్దిన్ రజ్వీ బరేల్వీ అభ్యంతరం వ్యక్తం చేశారు. షరియత్ చట్టం ప్రకారం, నిఖా జరగాలంటే వధూవరులిద్దరూ తప్పనిసరిగా ముస్లింలై ఉండాలని మౌలానా స్పష్టం చేశారు. ఒమర్ అబ్దుల్లా ముస్లిం అయినప్పటికీ, నిధి రజ్దాన్ ముస్లిం కాదని, ఆమె ఇస్లాం మతాన్ని స్వీకరించలేదని అన్నారు. కాబట్టి ఈ వివాహం ఇస్లామిక్ చట్టాల ప్రకారం చెల్లదని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ నిఖాకు ముందే ఆమె మతం మారి ఉంటేనే ఆ పెళ్లికి గుర్తింపు ఉండేదని వివరించారు. కాగా, "కొత్త ప్రయాణం మొదలైంది" అంటూ ఒమర్ అబ్దుల్లా శనివారం సోషల్ మీడియా ద్వారా నిధి రజ్దాన్‌తో తన వివాహ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. ఢిల్లీలో కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రత్యేక వివాహ చట్టం కింద వీరి పెళ్లి జరిగింది. ఒమర్ అబ్దుల్లాకు ఇది రెండో వివాహం. ఆయన తన మొదటి భార్య పాయల్ నాథ్‌తో 2009 నుంచి విడిగా ఉంటున్నారు. ఈ ఏడాది జులై 31న సుప్రీంకోర్టు వీరికి పరస్పర అంగీకారంతో విడాకులు మంజూరు చేసింది.

భారత నం.1 కుబేరుడిగా ముకేశ్ అంబానీ



న్యూఢిల్లీ: భారత పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ సంపద సోమవారం ఒక్కరోజే ఉవ్వెత్తున ఎగిసింది. కంపెనీ అంచనాలను మించి త్రైమాసిక ఫలితాలను ప్రకటించడంతో రిలయన్స్ షేర్లు భారీగా లాభపడ్డాయి. ఈ పరిణామంతో అంబానీ సంపద ఒక్కరోజే బిలియన్ల డాలర్ల మేర పెరిగి, ఆయన తిరిగి భారతదేశంలో అత్యంత సంపన్నుడిగా అవతరించారు. వివరాల్లోకి వెళితే, దీపావళి పండుగ సమీపిస్తున్న తరుణంలో నవంబర్ 2న రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు మార్కెట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. బీఎస్ఈలో రిలయన్స్ షేరు ధర ఏకంగా 11.64% పెరిగి రూ.1,299 వద్ద ముగిసింది. గత ఆరేళ్లలో కంపెనీ షేరుకు ఇది ఒక్కరోజులో అతిపెద్ద లాభం కావడం విశేషం. ఈ ర్యాలీతో నిఫ్టీ 50 సూచీకి రిలయన్స్ అతిపెద్ద కంట్రిబ్యూటర్‌గా నిలిచింది. షేర్ల ర్యాలీ నేరుగా ముకేశ్ అంబానీ నికర సంపదపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. ఫోర్బ్స్ రియల్-టైమ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం, సోమవారం ఒక్కరోజే అంబానీ సంపద 6.3 బిలియన్ డాలర్ల నుంచి 8.5 బిలియన్ డాలర్ల మధ్య పెరిగింది. దీంతో ఆయన సంపద మొత్తం 88.8 బిలియన్ డాలర్లకు (రూ.8.4 లక్షల కోట్లు) చేరుకుంది. ఈ వృద్ధితో ఆయన ప్రపంచవ్యాప్తంగా ఆ రోజు అత్యధిక సంపదను ఆర్జించిన వ్యక్తిగా (టాప్ గ్లోబల్ గెయినర్) నిలిచారు. ఈ క్రమంలో గౌతమ్ అదానీని వెనక్కి నెట్టి, ఫోర్బ్స్ ర్యాంకింగ్స్‌లో భారత నంబర్ వన్ కుబేరుడిగా తన స్థానాన్ని తిరిగి దక్కించుకున్నారు.

రిలయన్స్ దూకుడు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారాన్ని భారీ లాభాలతో ప్రారంభించాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,233.25 పాయింట్లు (1.66 శాతం) పెరిగి 75,692.78 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 387.70 పాయింట్లు (1.68 శాతం) లాభపడి 23,440.80 వద్ద ముగిసింది. రెండు సూచీలూ రోజులో గరిష్ఠ స్థాయిల వద్దే ముగియడం విశేషం. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు భారీగా పుంజుకోవడం, ముడి చమురు ధరలు తగ్గడం మార్కెట్లకు ప్రధానంగా కలిసొచ్చాయి. సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 11.64 శాతం దూసుకెళ్లింది. టాటా స్టీల్ 5.64 శాతం, అల్ట్రాటెక్ సిమెంట్ 2.75 శాతం, ఎస్‌బీఐ 2.71 శాతం, ఎన్‌టీపీసీ 2.37 శాతం, మారుతి సుజుకి 2.16 శాతం చొప్పున లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, భారత్ ఎలక్ట్రానిక్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్ షేర్లలోనూ కొనుగోళ్ల కనిపించాయి. మరోవైపు ఐటీ షేర్లలో కొంత అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఇన్ఫోసిస్ 1.61 శాతం నష్టపోయి ప్రధాన సూచీల్లో అత్యధికంగా పడిపోయిన షేరుగా నిలిచింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.65 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.63 శాతం, సన్ ఫార్మా 0.58 శాతం, యాక్సిస్ బ్యాంక్ 0.47 శాతం చొప్పున తగ్గాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్ కూడా స్వల్ప నష్టాలతో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ 5.95 శాతం పెరిగి అగ్రస్థానంలో నిలిచింది. మెటల్ సూచీ 3.21 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 2.70 శాతం లాభపడ్డాయి. ఆటో, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫైనాన్షియల్ సర్వీసెస్, రియల్టీ, కెమికల్స్ షేర్లలోనూ కొనుగోళ్లు జరిగాయి. అయితే మీడియా సూచీ 0.76 శాతం, ఐటీ సూచీ 0.50 శాతం నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం కూడా దేశీయ మార్కెట్లకు ఊరటనిచ్చింది. డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 4.23 శాతం తగ్గి బ్యారెల్‌కు 99.72 డాలర్లకు చేరగా, బ్రెంట్ క్రూడ్ 4.28 శాతం పడిపోయి 108.57 డాలర్ల వద్ద ట్రేడైంది. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్య ప్రయత్నాలు మళ్లీ ఊపందుకోవడంతో చమురు సరఫరాలపై ఆందోళనలు కొంత తగ్గినట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

ఇండియా ర్యాలీతో 11 వేల కోట్ల నష్టం

ఎవరు చెల్లిస్తారన్న వ్యాపార సంఘాలు



న్యూఢిల్లీ: రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిన్న 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీ కారణంగా తమకు రూ.11,000 కోట్ల మేర భారీ వ్యాపార నష్టం వాటిల్లిందని ఢిల్లీ వ్యాపార సంఘాలు ఆరోపించాయి. పండుగల సీజన్‌లో ఈ ర్యాలీ నిర్వహించడం వల్ల వ్యాపారం పూర్తిగా దెబ్బతిన్నదని ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసింది. సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ... నిన్న జరిగిన ర్యాలీ వల్ల ఢిల్లీకి ప్రత్యక్షంగా రూ.11,000 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ఇందులో రిటైల్, హోల్‌సేల్ వ్యాపారం ద్వారా రూ.8,800 కోట్లు, రవాణా, లాజిస్టిక్స్ రంగంలో రూ.1,500 కోట్లు, హాస్పిటాలిటీ, పర్యాటక రంగంలో రూ.500 కోట్ల నష్టం జరిగిందని వివరించారు. రామ్‌లీలా మైదానానికి 5 కిలోమీటర్ల పరిధిలోని చాందినీ చౌక్, కన్నాట్ ప్లేస్, కరోల్ బాగ్, సదర్ బజార్ వంటి ప్రధాన మార్కెట్లలోని సుమారు 2.5 లక్షల దుకాణాలు పూర్తిగా మూతపడ్డాయని సీటీఐ పేర్కొంది. దీనివల్ల దాదాపు 20 లక్షల మంది రోజువారీ కార్మికులు, వీధి వ్యాపారులు ఉపాధి కోల్పోయారని, వారికి రూ.200 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపింది. మరోవైపు, ఈ ఆరోపణలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. బీజేపీ ప్రభుత్వమే బలవంతంగా దుకాణాలను మూయించిందని ఆయన ఆరోపించారు. ర్యాలీకి వచ్చిన వారు స్థానిక వ్యాపారులకు మద్దతుగా షాపింగ్ చేయాలని తాము కోరామని, కానీ బీజేపీ ప్రభుత్వం అన్ని దుకాణాలను మూయించేసిందని ఒక వీడియోలో విమర్శించారు.

ఏపీకి కర్ణాటక సాయం

రంగంలోకి 500 మంది సిబ్బంది

బెంగళూరు: అర్నబ్ తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలిచేందుకు పొరుగు రాష్ట్రం కర్ణాటక ముందుకొచ్చింది. తుఫాను ధాటికి దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను పునరుద్ధరించేందుకు అవసరమైన సిబ్బందిని, పరికరాలను అందించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కర్ణాటక తక్షణమే స్పందించింది. ఇరు రాష్ట్రాల మధ్య సహకార స్ఫూర్తితో ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విపత్కర సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కర్ణాటక ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. "విద్యుత్ అత్యవసర సేవ. తుఫాను బాధితుల సంక్షేమం దృష్ట్యా విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించడం చాలా ముఖ్యం" అని డీకే శివకుమార్ అన్నారు. కర్ణాటక ఇంధన శాఖ మంత్రి కేజే జార్జ్ పర్యవేక్షణలో సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 500 మంది నైపుణ్యం కలిగిన లైన్‌మెన్లు (పవర్‌మెన్లు), క్రేన్లు, భూమిని తవ్వే యంత్రాలతో కూడిన 15 పాల్‌ఫింగర్ ట్రక్కులు, 25 ట్రాక్టర్ మౌంటెడ్ డ్రిల్లింగ్ యంత్రాలను ఏపీకి పంపారు. ఈ బృందాలు సోమవారం మధ్యాహ్నం బయల్దేరి ఆంధ్రప్రదేశ్‌కు చేరుకున్నాయి. సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో సమర్థంగా సమన్వయం చేసేందుకు ప్రతి విద్యుత్ సరఫరా కంపెనీ నుంచి ఒక అధికారిని స్పెషల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌గా నియమించారు. పది మంది లైన్‌మెన్లతో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేసి, దానికి ఒక జూనియర్ ఇంజనీర్ లేదా అసిస్టెంట్ ఇంజనీర్ నాయకత్వం వహిస్తారు. మొత్తం కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి అధికారులను కూడా నియమించారు. సహాయక సిబ్బంది ప్రయాణం, బస, ఇతర అత్యవసర ఖర్చుల కోసం అవసరమైన నిధులను కూడా కర్ణాటక ప్రభుత్వమే సమకూరుస్తోంది. ప్రకృతి విపత్తుల సమయంలో 'పొరుగువారే ప్రథమం' అనే సూత్రానికి కట్టుబడి, బాధితులకు వేగంగా సేవలు అందించడంలో తమ నిబద్ధతను ఈ సాయం చాటుతోందని కర్ణాటక వర్గాలు తెలిపాయి.



ముగ్గురు ఆప్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి జంప్

చండీగఢ్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు మరో ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి బీజేపీలో చేరారు. సోమవారం ఉదయం ఆప్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే, మాజీ ఐపీఎస్ అధికారి కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్ తన శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అనంతరం కొన్ని గంటల్లోనే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు ఆదివారం పార్టీకి రాజీనామా చేసిన మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా సోమవారం బీజేపీలో చేరారు. అమృత్‌సర్ నార్త్ ఎమ్మెల్యే కున్వర్ విజయ్ ప్రతాప్ సింగ్‌తో పాటు పటియాలా జిల్లాలోని సమనా ఎమ్మెల్యే చేతన్ సింగ్ జౌరమజ్రా, సనౌర్ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్‌మజ్రా బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు. దీంతో పంజాబ్‌లో ఆప్ రాజకీయంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. 2027 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఆప్ ఇటీవల 40 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించింది. ఈ జాబితాలో సమనా, సనౌర్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. అయితే ఆ రెండు నియోజకవర్గాలకు పార్టీ కొత్త ఇన్‌ఛార్జ్‌లను నియమించడంతో తమకు మళ్లీ టికెట్లు దక్కకపోవచ్చని భావించిన జౌరమజ్రా, పఠాన్‌మజ్రా పార్టీని వీడినట్లు వార్తలు వచ్చాయి. పార్టీని వీడిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఆప్ నాయకత్వంపై విమర్శలు చేశారు. ఢిల్లీ నాయకత్వం పంజాబ్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్య, అప్పుల భారం, శాంతిభద్రతల పరిస్థితిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మరోవైపు, పార్టీ నుంచి వెళ్లిపోయిన లేదా సస్పెండ్ అయిన నేతలను బీజేపీ చేర్చుకుంటోందని పంజాబ్ ఆప్ అధ్యక్షుడు అమన్ అరోరా విమర్శించారు.

20 నిమిషాల్లో రూ.52,000 కోట్లు ఆవిరి

బినాన్స్‌పై చరిత్రలోనే అతిపెద్ద సైబర్ దాడి



న్యూయార్క్: ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ అయిన బినాన్స్‌పై చరిత్రలోనే అతిపెద్ద సైబర్ దాడి జరిగింది. కేవలం 20 నిమిషాల వ్యవధిలో హ్యాకర్లు సుమారు 6.3 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.52,000 కోట్లు) విలువైన క్రిప్టో ఆస్తులను దొంగిలించారు. ఈ భారీ హ్యాకింగ్ ఘటన తర్వాత బినాన్స్ తన సేవలను తిరిగి ప్రారంభించింది. వినియోగదారులకు నష్టం వాటిల్లకుండా చోరీకి గురైన ఆస్తులలో 95 శాతాన్ని తమ సొంత నిధులతో భర్తీ చేసినట్లు ప్రకటించింది. అక్టోబర్ 29న న్యూయార్క్ కాలమానం ప్రకారం, రాత్రి సమయంలో ఈ దాడి జరిగింది. బహుళ బ్లాక్‌చెయిన్‌లలోని హాట్ వాలెట్ల నుంచి హ్యాకర్లు వేగంగా నిధులను ఖాళీ చేశారు. ఈ దాడి వెనుక ఉత్తర కొరియా ప్రభుత్వ ప్రాయోజిత హ్యాకింగ్ యూనిట్ 'ట్రేడర్‌ట్రైటర్' (లాజరస్ గ్రూప్‌గా కూడా పిలుస్తారు) ఉందని అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఆరోపించింది. ఇదే గ్రూప్ 2025లో బైబిట్ ఎక్స్ఛేంజ్‌పై జరిపిన దాడిలో 1.5 బిలియన్ డాలర్లను దొంగిలించినట్లు గతంలో ఆరోపణలు ఉన్నాయి. బినాన్స్ సహ వ్యవస్థాపకురాలు, కో-సీఈవో యి హే అబుదాబిలోని తన నివాసంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' చూస్తుండగా ఈ విషయం తెలుసుకుని వెంటనే అప్రమత్తమయ్యారు. సుమారు 100 మంది నిపుణులతో ఒక 'గ్లోబల్ వార్ రూమ్' ఏర్పాటు చేసి నష్ట నివారణ చర్యలు చేపట్టారు.



కర్ణాటకలో పెరగనున్న ఆర్టీసీ చార్జీలు

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయాణికులపై మరో భారం మోపడానికి సిద్ధమైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆర్టీసీ బస్సు చార్జీలను నవంబర్ 5వ తేదీ నుంచి పెంచుతున్నట్లు రవాణా శాఖ మంత్రి బైరతి సురేశ్ ప్రకటించారు. భారీ ఆర్థిక నష్టాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నాలుగు రోడ్డు రవాణా సంస్థలు (ఆర్టీసీలు) ఇప్పటికే రూ.9,000 కోట్ల భారీ నష్టాల్లో కూరుకుపోయాయని మంత్రి వివరించారు. గడిచిన ఏడాది కాలంలో డీజిల్ ధరలు ఐదుసార్లు పెరగడం వల్ల సంస్థలపై ఏటా రూ.2,000 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో చార్జీల పెంపు అనివార్యమైందని ఆయన పేర్కొన్నారు. చార్జీల పెంపు అధికారాన్ని ముఖ్యమంత్రి రవాణా శాఖకే అప్పగించారని, గత వారం కేబినెట్‌లో దీనిపై చర్చ జరిగిందని మంత్రి సురేశ్ చెప్పారు. అయితే, చార్జీలను ఎంతమేర పెంచాలనే దానిపై నవంబర్ 4న ఆర్టీసీ అధికారులతో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే 'శక్తి' పథకం అమలు తర్వాత ఆర్టీసీ బస్సుల్లో పురుష ప్రయాణికుల శాతం 48 నుంచి 36 శాతానికి పడిపోయిందని, ఇది కూడా సంస్థల ఆదాయంపై కొంత ప్రభావం చూపిందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బస్ చార్జీలు పెంచడం ఇది రెండోసారి.

చైనా, రష్యాపై గూఢచర్యం: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యంతర ఎన్నికల ప్రచారాన్ని ముగిస్తూ చైనా, రష్యాపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశాలు అమెరికాపై నిఘా పెట్టినట్లే తాము కూడా వాటిపై నిఘా పెడుతున్నామని చెప్పారు. పైగా, వాటి కంటే మెరుగ్గా గూఢచర్యం చేయగలమని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో యుద్ధాన్ని సమర్థించుకున్నారు. ద్రవ్యోల్బణం తగ్గుతోందని, చమురు ధరలు కూడా దిగివస్తున్నాయని పేర్కొన్నారు. అమెరికాపై చైనా, రష్యా గూఢచర్యం చేస్తున్నాయన్న ఆందోళనలను ట్రంప్ తోసిపుచ్చారు. అయోవాలోని దుబుక్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. చైనా, రష్యా అమెరికాపై నిఘా పెడుతున్నాయని తనకు తెలుసని చెప్పారు. తాము కూడా ఆ దేశాలపై నిఘా ఉంచుతున్నామని, ఈ విషయంలో తమదే పైచేయి అని వ్యాఖ్యానించారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీశామని ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశానికి రాడార్లు, వైమానిక రక్షణ ఆయుధాలు లేవని అన్నారు. నాయకులు కూడా లేకుండా చేశామని వ్యాఖ్యానించారు. చర్చలు జరిపేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు కూడా ఎవరూ సిద్ధంగా లేరని చెప్పారు. యుద్ధాన్ని తాము ప్రారంభించలేదని, ముగింపు దశకు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.





2028లో ప్రభాస్ డబుల్ ఫీస్ట్

రెబల్ స్టార్ ప్రభాస్ భారీ బడ్జెట్ ప్రాజెక్ట్‌లతో బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించడానికి సిద్ధమవుతున్నారు. ఒకవైపు వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతూనే మరోవైపు వాటి షూటింగ్‌లను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే లైనప్‌లో ఉన్న మోస్ట్ అవేటెడ్ సినిమాల విడుదల తేదీలపై ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. 2027 – 2028 సంవత్సరాలను ప్రభాస్ సినిమాలతో పూర్తిగా ఏలబోతున్నారనే వార్త అభిమానుల్లో పూనకాలు తెప్పిస్తుంది. ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల రిలీజ్ డేట్స్ ప్లానింగ్ ఓ రేంజ్‌లో ఉంది. ముందుగా 2027 మార్చి 19న హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా ఫౌజీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా అనంతరం అదే ఏడాది అక్టోబర్ 2న సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న పవర్ ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ స్పిరిట్ థియేటర్లలోకి రాబోతున్నట్లు సమాచారం. ఈ రెండు చిత్రాలు 2027 ఏడాదిని సినిమా ప్రియులకు పండగలా మార్చడం ఖాయం. అయితే అసలు సిసలు బాక్సాఫీస్ విధ్వంసం మాత్రం 2028లో జరగబోతోంది. 2028 లో ప్రభాస్ రెండు భారీ పాన్ ఇండియా సీక్వెల్ చిత్రాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. సమ్మర్ కానుకగా ఇండియన్ సినిమా చరిత్రలోనే నిలిచిపోయే కల్కి 2898 ఏడీ సీక్వెల్ కల్కి 2 చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నాగ్ అశ్విన్ డైరెక్షన్‌లో తెరకెక్కుతోన్న సైన్స్ ఫిక్షన్ విజువల్ వండర్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే ఏడాది చివర్లో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కనున్న మాస్ యాక్షన్ మానియా సలార్: పార్ట్ 2 – శౌర్యాంగ పర్వం సినిమా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

13న నెట్‌ఫ్లిక్స్‌లో రణబాలి..!



స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన యాక్షన్, లవ్ స్టోరి రణబాలి. బ్రిటీష్ పాలన కాలంలో రాయలసీమను కాటేసిన కరువు నేపథ్యంగా రూపొందించిన ఈ సినిమాకు రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై పాపులర్ ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, రవిశంకర్ నిర్మించారు. ఈ మూవీకి గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ సీరిస్ ఫిల్మ్స్ సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో అర్నాల్డ్ వాస్లూ, ఈశ్వరీ రావు తదితరులు నటించారు. థియేట్రికల్‌గా పలు ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్ సాధించిన ఈ చిత్రం బాక్సాఫీస్ జర్నీని ముగించుకొని డిజిటల్ స్ట్రీమింగ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్‌లో రిలీజ్ అయ్యేందుకు రెడీ అయింది. ఈ సినిమా నవంబర్ 13వ తేదీన స్ట్రీమింగ్ అవుతుందని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా ప్రకటించింది. అయితే, కాసేపటికే నెట్‌ఫ్లిక్స్ ఆ పోస్ట్‌ను తొలగించింది. ఈ నేపథ్యంలో ఓటీటీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావాల్సి ఉంది.



మైసా.. రష్మిక కిర్రాక్

'నేషనల్ క్రష్' రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'మైసా' నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ విడుదల చేశారు. ఈ సినిమా నుంచి 'ఓ మైసా రే' పేరుతో తొలి పాట లిరికల్ వీడియోను సోమవారం ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. మహిళా శక్తిని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేలా ఈ పాట సాగుతూ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ గీతానికి, సుప్రసిద్ధ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ శక్తివంతమైన సాహిత్యాన్ని అందించారు. గాయని సింధుజ శ్రీనివాసన్ తన గాత్రంతో పాటకు ప్రాణం పోశారు. కథానాయిక పాత్రలోని ధైర్యం, తెగువ, పోరాట స్ఫూర్తిని ఈ పాట ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా, ఈ లిరికల్ వీడియోలో రష్మిక మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా ఆమె లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. బృందా మాస్టర్ కొరియోగ్రఫీ పాటకు అదనపు ఆకర్షణగా నిలిచింది. రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్‌ఫార్ములా ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రొటీన్ పాత్రలకు భిన్నంగా రష్మిక చేస్తున్న ఈ ప్రయోగంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. 'మైసా' చిత్రాన్ని నవంబర్ 27న తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

జైలర్ 2.. 800 కోట్లు

సూపర్‌స్టార్ రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ చిత్రం 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన 18 రోజుల్లోనే ఈ సినిమా రూ.800 కోట్ల మార్కును దాటినట్లు ట్రేడ్ లెక్కలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఈ మైలురాయిని అందుకున్న తొలి తమిళ చిత్రంగా 'జైలర్ 2' నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. 75 ఏళ్ల వయసులోనూ రజనీకాంత్‌కు ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని ఈ వసూళ్లు మరోసారి నిరూపిస్తున్నాయి. మూడో వారాంతంలోనూ 'జైలర్ 2' వసూళ్ల జోరు కొనసాగింది. నవంబర్ 1 ఆదివారం 18వ రోజు దేశవ్యాప్తంగా సుమారు 8,906 ప్రదర్శనల ద్వారా రూ.11.20 కోట్ల నికర వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ నివేదికలు వెల్లడించాయి. అంతకుముందు శనివారం వచ్చిన రూ.9.70 కోట్లతో పోలిస్తే ఆదివారం వసూళ్లు దాదాపు 15.5 శాతం పెరిగాయి. దీంతో భారతదేశంలో ఈ సినిమా మొత్తం నికర వసూళ్లు రూ.456.30 కోట్లకు చేరగా, దేశీయంగా రూ.533.75 కోట్ల గ్రాస్ నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం గ్రాస్ వసూళ్లు రూ.807.25 కోట్లకు చేరినట్లు అంచనా.





మంచు లక్ష్మి.. మంచి మనసు

ప్రముఖ సినీ నటి, సామాజిక కార్యకర్త మంచు లక్ష్మి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నడుం బిగించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్టు ఆమె తెలిపారు. తన 'టీచ్ ఫర్ చేంజ్' స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నట్లు ప్రకటించారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన మంచు లక్ష్మి... చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ 'టీచ్ ఫర్ చేంజ్' ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన లక్ష్మి... గ్రామీణ విద్యార్థుల కోసం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. దత్తత తీసుకున్న పాఠశాలల్లో స్మార్ట్ ఎల్ఈడీ టీవీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. నాణ్యమైన విద్య ద్వారానే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు తనవంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

ఫేక్ గురూజీ



మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నటి పూనమ్ కౌర్ మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. త్రివిక్రమ్‌కు సంబంధించిన ఏదైనా వార్త బయటకు వచ్చినా, ఆయన సినిమా విడుదలైనా పూనమ్ సోషల్ మీడియా వేదికగా స్పందించడం చర్చనీయాంశంగా మారుతోంది. గతంలోనూ ఆయనపై పరోక్షంగా ఆరోపణలు చేసిన ఆమె.. ఈసారి మరింత ఘాటైన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'ఫేక్ గురూజీ' అంటూ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా తన సినీ కెరీర్‌ను ముగించారని ఆరోపిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "నువ్వు నా కెరీర్‌ను ముగించావు. నీ దుర్వినియోగాన్ని నేను ప్రశ్నించాననే కారణంతో ఇలా చేశావా? ఇప్పుడు దేవుడు నీకు ఏమి చేశాడో చూడు. కనీసం కొంతైనా సిగ్గుపడాలి. వేదికలపై నువ్వు నీతులు చెప్పవచ్చు.. కానీ నేను వాటిని ఆచరిస్తాను" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.



కుల్దీప్‌ను పక్కనబెట్టడం ఆశ్చర్యంగా ఉంది

టీమిండియా మేనేజ్‌మెంట్ వైఖరిపై భారత మాజీ స్పిన్నర్, సెలెక్టర్ వెంకటపతిరాజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ముఖ్యంగా మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో అవకాశాలు ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టాడు. న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో సిరీస్ గెలిచిన తర్వాత కూడా కుల్దీప్‌కు ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం కల్పించకపోవడం తనను ఆశ్చర్యపరిచిందని అన్నాడు. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని కుల్దీప్‌కు మరిన్ని అవకాశాలు ఇవ్వాలని వెంకటపతిరాజు సూచించాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసిన వర్చువల్ సమావేశంలో ఐఏఎన్ఎస్‌తో వెంకటపతిరాజు మాట్లాడుతూ, "పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మణికట్టు స్పిన్నర్లు ఎంత విలువైన ఆస్తి అనేది మనందరికీ తెలుసు. అలాంటి ఆటగాడిని మూడు ఫార్మాట్లలోనూ జట్టులోకి తీసుకున్నప్పటికీ, బెంచ్‌కే పరిమితం చేయడం ఆశ్చర్యంగా ఉంది. అతడికి అంతర్జాతీయ మ్యాచ్‌లలో అవకాశం ఇవ్వనప్పుడు, కనీసం దేశవాళీ క్రికెట్ ఆడుకోవడానికైనా అనుమతించాలి. ఏ స్పిన్నర్ అయినా ఎక్కువ మ్యాచ్‌లు ఆడితేనే బౌలింగ్‌పై నియంత్రణ సాధిస్తాడు" అని స్పష్టం చేశాడు. ప్రస్తుత భారత బౌలింగ్ లైనప్‌లో వైవిధ్యం లోపించిందని, అందుకే ప్రత్యర్థి బ్యాటర్లు సులభంగా ఎదురుదాడికి దిగుతున్నారని రాజు విశ్లేషించాడు. "కుల్దీప్‌కు మరిన్ని అవకాశాలు ఇవ్వాలి. ఒకటి రెండు మ్యాచ్‌లు ఓడినా ఫర్వాలేదు. కానీ, అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఒత్తిడిని తట్టుకుని బౌలింగ్ చేస్తేనే అతను మెరుగవుతాడు. ప్రస్తుతం అతను అంతర్జాతీయ క్రికెట్ ఆడటం లేదు, దేశవాళీ క్రికెట్‌కూ దూరంగా ఉంటున్నాడు. ఇది సరైన పద్ధతి కాదు" అని అభిప్రాయపడ్డాడు.

కోచ్‌గా మానసిక ఒత్తిడి



టీమిండియా హెడ్‌కోచ్‌గా బాధ్యతలు నిర్వహించడం అంత సులభం కాదు. ప్రతి మ్యాచ్‌లో గెలవాలనే అంచనాలు.. ఆటగాళ్ల ఎంపికలో సవాళ్లు.. వరుస పర్యటనలు.. ఇలా నిరంతరం ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో తాను కూడా కొన్నిసార్లు మానసికంగా అలసిపోతున్నానని భారత జట్టు హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అంగీకరించాడు. అయితే ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం తనకు ఉందని స్పష్టం చేశాడు. న్యూజిలాండ్‌తో ఐదో టీ20 ముగిసిన అనంతరం మీడియాతో గంభీర్ మాట్లాడాడు. మూడు ఫార్మాట్లకు ఒకేసారి కోచ్‌గా వ్యవహరించడం సవాలుతో కూడుకున్నదని చెప్పాడు. ముఖ్యంగా వరుస పర్యటనలు, ప్రయాణాలు, మ్యాచ్‌ల మధ్య తగినంత విరామం లేకపోవడం ఇబ్బందిగా ఉంటుందని తెలిపాడు. భారత జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు ప్రతి మ్యాచ్ గెలవాలనే అంచనాలు ఉంటాయని పేర్కొన్నాడు. "నిజం చెప్పాలంటే.. నేను కూడా మానసికంగా అలసిపోయిన సందర్భాలున్నాయి. కానీ ఆ ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి నాకుంది. సాధ్యమైనంత కాలం దాన్ని భరిస్తాను. ఒత్తిడిని తట్టుకోగలను. అవసరమైతే బుల్లెట్‌ను కూడా ఎదుర్కొంటాను. నేనూ మనిషినే. కొన్నిసార్లు అలసట తప్పదు. అయితే ఇప్పటివరకు ఆ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నా" అని గంభీర్ వెల్లడించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ 3-2తో గెలుచుకుంది. చివరి రెండు మ్యాచ్‌ల్లో ఓడినప్పటికీ తొలి మూడు మ్యాచుల్లో విజయం సాధించడం గొప్ప విషయమని గంభీర్ అన్నాడు.

భువనేశ్వర్‌ను ఆడించి తప్పుచేశారు: ఇర్ఫాన్ పఠాన్

న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను ఎంపిక చేయడాన్ని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ తప్పుబట్టాడు. అతడిని ఎంపిక చేయడం 'పొరపాటు'గా అభివర్ణించాడు. టీ20 ప్రపంచకప్ ఇంకా చాలా దూరంలో ఉన్నప్పుడు, ఈ ఎంపిక వ్యూహాత్మకంగా సరైనది కాదని స్పష్టం చేశాడు. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో భువనేశ్వర్ కుమార్ జట్టులోకి పునరాగమనం చేశాడు. అయితే, ఈ సిరీస్‌లో అతడు పెద్దగా రాణించలేకపోయాడు. ఆడిన నాలుగు మ్యాచ్‌లలో కేవలం ఒకే వికెట్ తీసి, 180 పరుగులు సమర్పించుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో భారత్ తొలి మూడు మ్యాచ్‌లు గెలిచి, చివరి రెండు మ్యాచ్‌లలో ఓడిపోయింది. ఈ నేపథ్యంలో తన యూట్యూబ్ ఛానెల్‌లో ఇర్ఫాన్ పఠాన్ మాట్లాడుతూ.. "నా అభిప్రాయం ప్రకారం, సెలక్టర్లు ఎక్కడ తప్పు చేశారంటే భువనేశ్వర్ కుమార్‌ను ఈ సిరీస్‌లో ఆడించడం ద్వారానే. భువనేశ్వర్ మంచి బౌలర్, సీనియర్ ఆటగాడు అనడంలో సందేహం లేదు. కానీ, టీ20 ప్రపంచకప్ దరిదాపుల్లో లేనప్పుడు అతడిని ఇక్కడ ఆడించడం ప్రశ్నించాల్సిన విషయమే" అన్నాడు.



భారత-ఏ కెప్టెన్‌గా తిలక్ వర్మ

భారత-ఏ జట్టు:
తిలక్ వర్మ (కెప్టెన్), రజత్ పటిదార్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, విప్రాజ్ నిగమ్, హర్ష్ దూబే, తనుష్ కోటియన్, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్, అర్షద్ ఖాన్.

ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) నిర్వహించనున్న పురుషుల రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ కోసం భారత-ఏ జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మకు జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించగా, ఐపీఎల్‌లో రెండుసార్లు టైటిల్ గెలిచిన జట్టులో కీలక పాత్ర పోషించిన రజత్ పటిదార్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

ఈ టోర్నమెంట్ నవంబర్ 19 నుంచి 29 వరకు ఖతార్‌లోని దోహా వేదికగా జరగనుంది. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో కీలక ఆటగాళ్లకు చోటు దక్కింది. వికెట్ కీపర్లుగా ప్రభ్‌సిమ్రన్ సింగ్, కుమార్ కుశాగ్ర ఎంపికయ్యారు. వారితో పాటు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్, ప్రిన్స్ యాదవ్, సూర్యాంశ్ షెడ్గే, షాబాజ్ అహ్మద్, హర్ష్ దూబే వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. గాయం కారణంగా కొంతకాలంగా ఆటకు దూరమైన సీమ్ బౌలింగ్ ఆల్-రౌండర్ హర్షిత్ రాణా పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి పునరాగమనం చేశాడు. తనుష్ కోటియన్, విప్రాజ్ నిగమ్, అర్షద్ ఖాన్‌లతో జట్టు కూర్పు సమతూకంగా కనిపిస్తోంది. గత ఏడాది దోహాలో జరిగిన టోర్నీలో పాల్గొన్న భారత-ఏ జట్టుతో పోలిస్తే ఈసారి సెలక్టర్లు భారీ మార్పులు చేశారు. గత జట్టు నుంచి కేవలం వైభవ్ సూర్యవంశీ, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే మాత్రమే తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. గత కెప్టెన్ జితేష్ శర్మ, వైస్ కెప్టెన్ నమన్ ధీర్‌లతో పాటు పలువురు ఆటగాళ్లను వివిధ కారణాలతో ఎంపిక చేయలేదు. ఈ టోర్నమెంట్‌లో భారత-ఏ జట్టు గ్రూప్-బిలో ఉంది. ఇదే గ్రూప్‌లో యూఏఈ, నేపాల్, పాకిస్థాన్-ఏ జట్లు ఉన్నాయి. గ్రూప్-ఏలో బంగ్లాదేశ్-ఏ, శ్రీలంక-ఏ, ఆఫ్ఘనిస్థాన్-ఏ, హాంకాంగ్ ఉన్నాయి. భారత్ తన తొలి మ్యాచ్‌ను నవంబర్ 20న నేపాల్‌తో ఆడనుంది. అనంతరం నవంబర్ 22న పాకిస్థాన్-ఏ జట్టుతో, నవంబర్ 24న యూఏఈతో తలపడనుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 26, 27 తేదీల్లో సెమీఫైనల్స్, నవంబర్ 29న ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.



హార్దిక్ కోసం కోల్‌కతా పట్టు!

ఐపీఎల్ 2027 వేలానికి ముందు స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను ట్రేడింగ్ ద్వారా తమ జట్టులోకి తీసుకురావడానికి కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) గట్టి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, ఈ డీల్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ (ఎంఐ) పెడుతున్న షరతులు చర్చలకు పెద్ద అడ్డంకిగా మారాయి. ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై.. హార్దిక్‌కు బదులుగా తమకు పేసర్ హర్షిత్ రాణా, యువ వికెట్ కీపర్ బ్యాటర్ అంగ్‌క్రిష్ రఘువంశీలను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు 'టెలిగ్రాఫ్' నివేదిక పేర్కొంది. మరోవైపు, ఈ ట్రేడింగ్‌లో తమ కీలక ఆటగాళ్లను వదులుకునే ప్రసక్తే లేదని కేకేఆర్ యాజమాన్యం స్పష్టంగా ఉంది. ముఖ్యంగా స్టార్ స్పిన్నర్లు సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తితో పాటు జట్టు వైస్-కెప్టెన్, కీలక ఫినిషర్ అయిన రింకూ సింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని స్పష్టం చేసింది. అదే సమయంలో ఆస్ట్రేలియన్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ తన వర్క్‌లోడ్ కారణంగా ఐపీఎల్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాడో లేదో స్పష్టత లేనందున, అతడిని కూడా ఈ ట్రేడింగ్‌లో చేర్చే అవకాశం కనిపించడం లేదు. వాస్తవానికి హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్, తరచూ గాయాల బారిన పడటం, అలాగే ప్రతీ వేదికకు అతనితో పాటు వచ్చే పెద్ద సిబ్బంది బృందంపై ఉన్న ఆందోళనల కారణంగా కేకేఆర్ యాజమాన్యం ప్రాథమిక చర్చల తర్వాత అంతగా ఆసక్తి చూపలేదని తెలిసింది. అయినప్పటికీ డీల్‌పై ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఐపీఎల్ 2024లో కేకేఆర్ టైటిల్ గెలవడంలో హర్షిత్ రాణా కీలక పాత్ర పోషించగా, 2026 సీజన్‌లో ఫ్రాంచైజీ తరఫున అత్యధిక పరుగులు చేసింది అంగ్‌క్రిష్ రఘువంశీనే. ఈ నేపథ్యంలో ఇంతటి కీలక ఆటగాళ్లను వదులుకోవడానికి కేకేఆర్ సిద్ధంగా ఉందో లేదో ఇంకా స్పష్టత లేదు. హార్దిక్ పాండ్యాను దక్కించుకునే రేసులో కేకేఆర్‌తో పాటు రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కూడా ఉన్నట్లు సమాచారం. రాజస్థాన్ నుంచి యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్‌లను ముంబై కోరగా, ఆ చర్చలు ముందుకు సాగలేదు.

ఐపీఎల్ క్యాలెండర్ మార్చాలి: లలిత్ మోదీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వ్యవస్థాపకుడు లలిత్ మోదీ, టోర్నమెంట్ నిర్వహణలో భారీ మార్పులకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం మార్చి-మే నెలల మధ్య జరుగుతున్న ఐపీఎల్‌ను అక్టోబర్-ఏప్రిల్ మధ్య కాలానికి మార్చాలని, జనవరిలోనే ప్రారంభించి మ్యాచ్‌ల సంఖ్యను 94కి పెంచాలని సంచలన ప్రతిపాదన చేశారు. ఈ మార్పులకు వీలుగా అంతర్జాతీయ క్యాలెండర్‌ను సర్దుబాటు చేసేందుకు ఐసీసీ చైర్మన్ జై షా చొరవ చూపాలని ఆయన కోరారు. క్రిక్‌బజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో లలిత్ మోదీ తన ప్రణాళికలను వివరించారు. "2008లో ఐపీఎల్ ప్రారంభించినప్పుడు ఏప్రిల్-మే నెలలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి, ఇప్పుడు పరిస్థితులు మారాయి. అప్పట్లో ఎనిమిది జట్లతో 59 మ్యాచ్‌లు ఉండేవి, కానీ ఇప్పుడు బీసీసీఐ జట్ల సంఖ్యను 10కి పెంచింది. 10 జట్లతో పూర్తిస్థాయి హోమ్ అండ్ అవే పద్ధతిలో టోర్నీ నిర్వహించాలంటే 94 మ్యాచ్‌లు అవసరమవుతాయి. ఇది పాత ఫార్మాట్‌తో పోలిస్తే దాదాపు 60% అధికం" అని ఆయన పేర్కొన్నారు. టోర్నమెంట్ చివరి దశలో వేడి, తేమ కారణంగా ఆటగాళ్లు, ప్రేక్షకులు ఇబ్బంది పడుతున్నారని మోదీ అన్నారు. మ్యాచ్‌ల సంఖ్య పెరిగినప్పుడు, అదే తక్కువ సమయంలో టోర్నీని ముగించడం వల్ల ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడి పడుతుందని, దీన్ని అధిగమించాలంటే సుదీర్ఘ సీజన్ అవసరమని వాదించారు. "ఫుట్‌బాల్ లీగ్స్ మాదిరిగా వారాంతపు మ్యాచ్‌లు, సరైన సమయాలు, సౌకర్యవంతమైన స్టేడియం వాతావరణం కల్పించడం ద్వారా అభిమానులకు మెరుగైన అనుభూతిని అందించవచ్చు" అని ఆయన తెలిపారు.

వన్డే ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘనిస్థాన్ అదుర్స్

అంతర్జాతీయ క్రికెట్‌లో ఆఫ్ఘనిస్థాన్ తన ప్రస్థానంలో మరో చారిత్రక మైలురాయిని అందుకుంది. ఐసీసీ తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి ఎగబాకింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ శ్రీలంకను వెనక్కి నెట్టి, తమ క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ర్యాంకును నమోదు చేసింది. ఈ ఘనతతో ఆఫ్ఘనిస్థాన్.. ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి బలమైన జట్ల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. 2009లో అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఆఫ్ఘన్ జట్టు, అనతికాలంలోనే అద్భుతమైన ప్రగతి సాధించింది. ఇప్పటివరకు 191 వన్డేలు ఆడిన ఆ జట్టు 96 మ్యాచ్ లలో విజయం సాధించి, బలమైన జట్టుగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. ముఖ్యంగా ప్రధాన టోర్నమెంట్లలో ఆఫ్ఘన్ ప్రదర్శన ప్రపంచాన్ని ఆకట్టుకుంది. భారత్ వేదికగా జరిగిన 2023 ఐసీసీ వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్, శ్రీలంక వంటి జట్లపై చారిత్రక విజయాలు నమోదు చేసి సంచలనం సృష్టించింది. అలాగే, ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి సెమీఫైనల్స్‌కు చేరి తమ సత్తా చాటింది. ఇటీవల కాలంలో సాధించిన వరుస విజయాలు ర్యాంకింగ్స్‌లో ఆఫ్ఘన్ స్థానాన్ని మరింత మెరుగుపరిచాయి. ఐర్లాండ్ పర్యటనలో ఆతిథ్య జట్టును 4-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ తర్వాత జింబాబ్వే, బంగ్లాదేశ్‌లతో జరిగిన ట్రై-సిరీస్‌లో ఒక్క ఓటమి కూడా లేకుండా అజేయంగా నిలిచింది. వన్డేలతో పాటు టీ20 ఫార్మాట్‌లోనూ ఆఫ్ఘన్ జోరు కొనసాగుతోంది. తాజాగా షార్జాలో జింబాబ్వేతో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
మంగళవారం 3-11-2026, జగిత్యాల
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

జాకీలు పెట్టి లేపే నాయకుడేరి!

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి చూస్తుంటే.. కొండంత బలమున్నా కదలలేని ఏనుగు గుర్తుకొస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ.. దేశవ్యాప్తంగా బలమైన రాజకీయ శక్తిగా ఎదిగిన పార్టీ.. తెలంగాణలో మాత్రం ఆశించిన స్థాయిలో ప్రజల ఆదరణను పొందలేకపోతోంది. ఎన్నికల సమయంలో హడావుడి చేయడం, నాయకుల ప్రకటనలతో వార్తల్లో నిలవడం వేరు.. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై పోరాడటం వేరు. ఈ రెండింటి మధ్య ఉన్న అంతరమే రాష్ట్రంలో బీజేపీకి ప్రధాన అడ్డంకిగా కనిపిస్తోంది. మరి ఈ నిస్తేజాన్ని తొలగించి, పార్టీని పరుగులు పెట్టించే నాయకుడెవరు? జాకీలు పెట్టి లేపే ధీరుడెవరు?

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం పాత్ర అత్యంత కీలకం. అధికార పక్షం తప్పులను ఎత్తిచూపడం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై నిలదీయడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడటం ప్రతిపక్షాల బాధ్యత. తెలంగాణలో రైతుల కష్టాలు, సాగునీటి సమస్యలు, నిరుద్యోగుల ఆవేదన, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత, పెరుగుతున్న జీవన వ్యయం వంటి అంశాలు ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఈ సమస్యలను నిరంతరం ప్రజా వేదికలపైకి తీసుకొచ్చి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత బీజేపీపై కూడా ఉంది. కానీ ప్రజల దృష్టిలో నిలిచిపోయేలా నిరంతర కార్యాచరణను రూపొందించడంలో పార్టీ వెనుకబడితే, రాజకీయంగా బలపడే అవకాశాలను తానే చేజార్చుకున్నట్లవుతుంది. అప్పుడప్పుడు నిర్వహించే నిరసనలు, నాయకుల విమర్శలు, పత్రికా ప్రకటనలు మాత్రమే పార్టీకి ప్రజల్లో బలమైన పునాది వేయలేవు. ప్రజల సమస్యలతో మమేకమై, వాటి పరిష్కారం కోసం చివరివరకు నిలబడినప్పుడే విశ్వసనీయత పెరుగుతుంది. కేంద్రంలో అధికారంలో ఉండటం బీజేపీకి ఒక రాజకీయ బలం. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి సంబంధించిన నిధులు, హామీల అమలు వంటి అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందిస్తూ పార్టీ ముందుకు సాగవచ్చు. కేంద్రం నుంచి తెలంగాణకు ఏమి లభించింది? ఇంకా ఏమి రావాలి? రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ విఫలమవుతోంది? కేంద్రం చేయాల్సిందేమిటి? రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిందేమిటి? అనే అంశాలను ఆధారాలతో ప్రజలకు వివరించాలి. కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసుకోవడం ఎంత ముఖ్యమో, రాష్ట్ర ప్రజల సమస్యలపై స్పందించడం కూడా అంతే ముఖ్యం. కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉందన్న విషయాన్ని రాజకీయ ప్రయోజనాలకు మాత్రమే పరిమితం చేయకుండా, తెలంగాణ అభివృద్ధికి ఉపయోగపడేలా కార్యాచరణ రూపొందించాలి. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించేటప్పుడు ప్రత్యామ్నాయ పరిష్కారాలను కూడా ప్రజల ముందుంచాలి. అప్పుడు మాత్రమే విమర్శలకు విశ్వసనీయత, పోరాటాలకు ప్రయోజనం చేకూరతాయి. తెలంగాణ బీజేపీలో నాయకులకు కొదవలేదు. రాజకీయ అనుభవం ఉన్నవారు, ప్రజాప్రతినిధులుగా పనిచేసినవారు, ఎన్నికల్లో తమ సత్తా చాటినవారు ఉన్నారు. అయినా ఆ బలాన్ని సమష్టి కార్యాచరణగా మార్చడంలోనే అసలు సవాలు ఉంది. నాయకుల వ్యక్తిగత ప్రాబల్యాల కంటే పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎవరి నియోజకవర్గంలో వారు పరిమితం కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై సమన్వయంతో ఉద్యమించాలి. నిస్తేజంలో ఉన్న పార్టీని లేపడానికి బయట నుంచి ఎవరో వచ్చి జాకీలు పెట్టాల్సిన పరిస్థితి ఎందుకు రావాలి? పార్టీకి ఉన్న నాయకత్వం, కార్యకర్తల బలం, రాజకీయ అనుభవం సక్రమంగా వినియోగంలోకి వస్తే చాలు. అయితే అందుకు మాటలతో సరిపెట్టని నాయకత్వం అవసరం. ప్రజల మధ్యకు వెళ్లే నాయకుడు కావాలి. రైతు పొలంలో నిలబడి అతని సమస్యను వినేవాడు కావాలి. నిరుద్యోగి ఆవేదనకు గొంతుకయ్యేవాడు కావాలి. ప్రభుత్వాన్ని నిలదీసేటప్పుడు ఆధారాలతో మాట్లాడేవాడు కావాలి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలను స్పష్టంగా విడదీసి ప్రజలకు వివరించేవాడు కావాలి.



రాజకీయ నాటకం.. ప్రజాసేవ బూటకం

ఎన్నికల ముందు ప్రజలే దేవుళ్లు.. అధికారం చేతికి వచ్చాక అదే ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరగాలి? ఎన్నికల సమయంలో పేదల కన్నీళ్లు తుడుస్తామని, రైతుల కష్టాలు తీరుస్తామని, నిరుద్యోగ యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పిస్తామని హామీలు గుప్పించే నాయకులు.. గెలిచిన తర్వాత వాటి అమలుపై ఎంత శ్రద్ధ చూపుతున్నారు? ఇదే నేటి రాజకీయాల్లో అసలు ప్రశ్న. ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పనిచేయాలి. కానీ ఆచరణలో ప్రజాసేవ కంటే ప్రచారానికి, పాలన కంటే రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం పెరుగుతున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఒక్క పార్టీకి, ఒక్క ప్రభుత్వానికి పరిమితం కాదు. కేంద్రంలోనైనా, రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న ప్రతి ప్రభుత్వానికీ ఇది వర్తిస్తుంది. ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం తప్పు కాదు. పేదలకు పింఛన్లు, రైతులకు సాయం, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ప్రజలకు వైద్య సేవలు అందించడం పాలకుల బాధ్యత. అయితే ఎన్ని పథకాలు ప్రకటించామన్నది కాదు.. వాటివల్ల ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వచ్చిందన్నదే ముఖ్యం. ప్రచార ఆర్భాటం పెరిగి, ఫలితాలు వెనుకబడితే ప్రజాసేవ లక్ష్యం దెబ్బతింటుంది.

ప్రజల పన్నులతో నడిచే ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. నిధుల వినియోగంలో పారదర్శకత, పథకాల అమలులో నాణ్యత, అవినీతిపై కఠిన చర్యలు తప్పనిసరి. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం దాన్ని వ్యతిరేకించడం కాదు. ప్రజాధనం ఎలా ఖర్చవుతోంది, పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరుతున్నాయా అని అడగడం ప్రజాస్వామ్యంలో పౌరుల హక్కు. కేంద్రం, రాష్ట్రాల మధ్య రాజకీయ విభేదాలు ఉన్నా ప్రజలకు అందాల్సిన సేవలకు ఆటంకం కలగకూడదు. నిధులు ఎవరు ఇచ్చారనే ప్రచారం కంటే ప్రజలకు సేవలు సమయానికి అందాయా లేదా అనేదే కీలకం. ప్రభుత్వం అధికార పార్టీకి మాత్రమే చెందదు. ప్రతిపక్షానికి ఓటు వేసినవారితో సహా ప్రతి పౌరుడికీ అది సమానంగా సేవ చేయాలి. ప్రజల బాధ్యత ఎన్నికల రోజున ఓటు వేయడంతో ముగియదు. ఎన్నికల తర్వాత కూడా పాలకుల పనితీరును పరిశీలించాలి. హామీల అమలు, నిధుల వినియోగం, స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రశ్నించాలి. అదే సమయంలో ప్రభుత్వాలు విమర్శలను సహించాలి. ప్రజల ఫిర్యాదులకు స్పందించి, సమస్యలు మళ్లీ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజాసేవ నిజమైనదిగా మారాలంటే పారదర్శకత, జవాబుదారీతనం, ఫలితాల ఆధారిత పాలన బలపడాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యుడికి గౌరవం దక్కాలి. పథకాలు రాజకీయ అనుచరులకే పరిమితం కాకుండా అర్హులందరికీ అందాలి. ఉపాధి, నాణ్యమైన విద్య, వైద్యం, వ్యవసాయాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయం ప్రజాసేవకు వేదిక కావాలి తప్ప, అధికారం కోసం ఆడే నాటకం కాకూడదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం, అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడం, ప్రజాధనాన్ని బాధ్యతగా వినియోగించడం.. ఇవే నాయకుల పనితీరుకు అసలైన గీటురాళ్లు. ప్రజలు ప్రశ్నించడం ఆపితే జవాబుదారీతనం తగ్గుతుంది. ప్రచారం పాలనను మించిపోతుంది. అందుకే ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలి. బాధ్యతాయుతమైన మీడియా, చురుకైన పౌర సమాజం, స్వతంత్ర ప్రజాస్వామ్య సంస్థలు పాలకులను జవాబుదారీగా నిలపాలి. అధికారం శాశ్వతం కాదు.. పదవులు శాశ్వతం కాదు. ప్రజల సమస్యలే నిజమైనవి. ప్రజల ఆశలే ప్రజాస్వామ్యానికి పునాది. మాటల్లో ప్రజాసేవ కాదు.. ప్రజల జీవితాల్లో కనిపించే మార్పే నిజమైన ప్రజాసేవ!



శ్రీనివాస్ జీడిపల్లి,
తూప్రాన్, మెదక్ జిల్లా



పశుపోషణ నుంచి ప్రజాపాలన వరకు

భారతదేశ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వికాసంలో యాదవ సమాజానికి ప్రత్యేక స్థానం ఉంది. పశుపోషణ, పాల ఉత్పత్తి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలవడం, జానపద కళలు, సంప్రదాయాల పరిరక్షణలో ఈ సమాజం అందించిన సేవలు విశేషమైనవి. తరతరాలుగా ప్రకృతితో మమేకమై జీవిస్తూ, పశుసంపదను కాపాడుతూ, ప్రజల ఆహార అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించిన యాదవులు నేడు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక సమానత్వం, పాలనా భాగస్వామ్యం వంటి అంశాలపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయంతోపాటు పశుపోషణ భారత గ్రామీణ జీవనానికి ఆధారం. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు వంటి పశువుల పెంపకం ద్వారా పాలు, పెరుగు, వెన్న, నెయ్యి వంటి పోషకాహార పదార్థాలను ప్రజలకు అందించడంలో యాదవుల కృషి కీలకమైనది. పశువుల సంరక్షణ, వాటి ఆరోగ్యం, మేత, నీటి లభ్యత, కాలానుగుణ వలసలు వంటి అంశాల్లో తరతరాలుగా సంపాదించిన అనుభవం ఈ సమాజానికి విలువైన సంపద. అడవులు, పచ్చికబయళ్లు, ప్రకృతి వనరులతో ముడిపడిన జీవన విధానం ద్వారా అనేక రకాల మొక్కలు, మేత వనరులపై స్థానిక పరిజ్ఞానం పెంపొందింది. గ్రామీణ ప్రాంతాల్లో పశుసంపదను కాపాడుతూ, పాడి పరిశ్రమకు పునాదిగా నిలుస్తున్న యాదవుల సేవలు ఆర్థిక వ్యవస్థకు ఎంతో అవసరం. అయితే ఈ సంప్రదాయ వృత్తికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు, పశు వైద్య సేవలు, ప్రభుత్వ ప్రోత్సాహం తోడైనప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుంది.

భారతదేశ చరిత్రలో యాదవ వంశాలకు ప్రాచీన నేపథ్యం ఉంది. యదు వంశ సంప్రదాయం, శ్రీకృష్ణుడితో ముడిపడిన సాంస్కృతిక వారసత్వం యాదవ సమాజానికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. వివిధ ప్రాంతాల్లో యాదవ వంశాలకు చెందిన పాలకులు రాజ్యాలను పరిపాలించిన చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కాలక్రమంలో ఈ సమాజం వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం, జానపద కళలు తదితర రంగాల్లో తనదైన ముద్ర వేసింది. చరిత్ర అనేది ఒక సామాజిక వర్గానికి మాత్రమే పరిమితమైనది కాదు. అనేక సమాజాల కృషి, పరస్పర సహకారం, సాంస్కృతిక మార్పిడి కలగలిపిన సమష్టి వారసత్వం. అందువల్ల యాదవుల చరిత్రను గౌరవించడంతోపాటు, ఇతర సామాజిక వర్గాల కృషినీ గుర్తించడం సమానత్వ సమాజ నిర్మాణానికి అవసరం. గ్రామీణ తెలంగాణలో గొల్లసుద్దులు, జానపద గేయాలు, కథాగానం, సంప్రదాయ ఆచారాలు సామాజిక జీవనంలో భాగంగా కొనసాగాయి. తరతరాలుగా సంక్రమించిన ఈ కళారూపాలు ప్రజలకు వినోదాన్ని అందించడమే కాకుండా, జీవన విలువలు, అనుభవాలు, స్థానిక చరిత్రను ఒక తరం నుంచి మరో తరానికి చేరవేశాయి. అలాగే గొంగడి వంటి సంప్రదాయ వస్త్రాలు పశు పోషకుల జీవన విధానంలో ప్రత్యేక స్థానం సంపాదించాయి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగపడే ఈ వస్త్రాల తయారీ, వినియోగం గ్రామీణ జీవన నైపుణ్యాలకు నిదర్శనం. ఇలాంటి సంప్రదాయ జ్ఞానాన్ని కాపాడుతూ, ఆధునిక మార్కెట్లకు అనుసంధానిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. యాదవ సమాజంలో గొల్ల, కురుమ తదితర వర్గాలకు ప్రత్యేకమైన వృత్తి, సాంస్కృతిక సంప్రదాయాలు ఉన్నాయి. ఈ భిన్నత్వాన్ని గౌరవిస్తూనే ఉమ్మడి సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయడం అవసరం. విద్య, ఉపాధి, పశుసంపద అభివృద్ధి, భూమి, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాల్లో సమష్టి కార్యాచరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే సమయంలో యాదవులు, మాదిగలు సహా వివిధ సామాజిక వర్గాల మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలపై పరిశోధన జరగాలి. ఆధారాలు లేని విభజన వాదాలు లేదా పరస్పర అనుమానాలు సమాజాల మధ్య దూరాన్ని పెంచకూడదు. కులాల మధ్య ఐక్యత అంటే ఒక వర్గం ఆధిపత్యం కాదు; అన్ని వర్గాలకు సమాన గౌరవం, హక్కులు, అవకాశాలు కల్పించడమే.

యాదవ సమాజం ఎదుర్కొంటున్న ప్రధాన ప్రశ్నల్లో రాజకీయ ప్రాతినిధ్యం ఒకటి. జనాభా, సామాజిక పాత్ర, ఆర్థిక సహకారానికి అనుగుణంగా చట్టసభల్లో ప్రాతినిధ్యం, పాలనా నిర్ణయాల్లో భాగస్వామ్యం పెరగాలనే ఆకాంక్ష సహజమైనది. అయితే రాజకీయ సాధికారత కేవలం జనాభాపై ఆధారపడదు. విద్య, రాజకీయ చైతన్యం, సంస్థాగత బలం, నాయకత్వ లక్షణాలు, ప్రజా సమస్యలపై అవగాహన కూడా కీలకం. యాదవ యువత విద్యకు ప్రాధాన్యమివ్వాలి. స్థానిక సంస్థల నుంచి శాసనసభ, పార్లమెంటు వరకు ప్రజాస్వామ్య ప్రక్రియల్లో చురుకుగా పాల్గొనాలి. రాజకీయ పదవులను కేవలం కుల ప్రతిష్ఠకు చిహ్నాలుగా కాకుండా ప్రజలకు సేవ చేసే బాధ్యతగా చూడాలి. సమాజంలోని పేదలు, మహిళలు, యువత, పశుపోషకుల సమస్యలను విధాన రూపకల్పనలో ప్రతిబింబించే నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. యాదవుల రాజకీయ ఎదుగుదల ఇతర వర్గాలకు వ్యతిరేకంగా సాగాల్సిన అవసరం లేదు. బలహీన వర్గాలు, వెనుకబడిన సమాజాలు, రైతులు, కార్మికులతో కలిసి హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడినప్పుడే సమానత్వ లక్ష్యం నెరవేరుతుంది. పశు సంపదను కాపాడిన అనుభవం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర, సంప్రదాయ జ్ఞానం యాదవ సమాజానికి ఉన్న బలాలు. ఈ బలాలను ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక ప్రణాళిక, సామాజిక చైతన్యంతో అనుసంధానించాలి. పాడి పరిశ్రమలో విలువ ఆధారిత ఉత్పత్తులు, గొర్రెల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు, మార్కెటింగ్ వ్యవస్థలు, సహకార సంఘాలు, యువతకు ఉపాధి అవకాశాలపై దృష్టి సారించాలి. రాజకీయంగా కూడా వ్యక్తిగత ఆధిపత్యాలకు కాకుండా సామూహిక ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. స్థానిక సమస్యలను అధ్యయనం చేసి, స్పష్టమైన కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్లాలి. ఎన్నికల్లో పోటీ చేయడం, ప్రజాప్రతినిధులుగా ఎన్నిక కావడం ప్రజాస్వామ్యంలో అందరికీ ఉన్న హక్కు. ఆ హక్కును వినియోగించుకోవడానికి అవసరమైన చైతన్యం, నాయకత్వం, ప్రజా విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. యాదవ సమాజం తన చరిత్రను గౌరవిస్తూ భవిష్యత్తును నిర్మించుకోవాలి. ఇతరులపై ఆధిపత్యం సాధించడం కాదు.. సమాన హక్కులు పొందడం, ఆత్మగౌరవంతో జీవించడం, పాలనలో భాగస్వాములు కావడం అసలైన లక్ష్యాలు కావాలి.



డాక్టర్ ఎన్ అశోక్
ఎంపీ, ఎంఎస్‌డబ్ల్యూ, బీఈడీ, పీహెచ్‌డీ, (ఎల్ఎల్‌బీ)
విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు
ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్
సెల్ 8499996667

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9493541919

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9493541919. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.